



TGTEL/26/A2635

వాస్తవాలు పలుకు
# DD9 వార్త
తెలుగు దినపత్రిక

హైదరాబాద్ | సంపుటి: 02 | సంచిక: 26 | 06-06-2026 శనివారం | పేజీలు: 06 | వెల: 3/-

## మంజీరా సరిహద్దుల్లో 'ఇసుక' చిచ్చు..




# కేసీఆర్.. దమ్ముంటే చర్చకు రా

**పాలమూరు ప్రాజెక్టులపై కేసీఆర్‌ను నిలదీసిన సీఎం**

**రూ.8 వేల కోట్లతో జిల్లాలో అభివృద్ధి పనులు: రేవంత్**



**పదేళ్ల బీఆర్ఎస్ పాలన,**
**రెండున్నరేళ్ల కాంగ్రెస్ పాలనపై చర్చకు సవాల్**
**2034 వరకు కాంగ్రెస్‌దే అధికారం..**
**'ఔర్ ఏక్ బార్ కాంగ్రెస్ సర్కార్' నినాదం**

**హైదరాబాద్, (డిడి9 వార్త):** జడ్చర్లలో నిర్వహించిన 'ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక' బహిరంగ సభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రతిపక్ష బీఆర్ఎస్, బీజేపీలపై తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. పాలమూరు బిడ్డగా గత రెండు రోజులుగా జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టులను స్వయంగా క్షేత్రస్థాయిలో పరిశీలించానని తెలిపిన ఆయన, వలసల కష్టాలు, ఆత్మహత్యల నష్టాలు అనుభవించిన ఈ గడ్డపై గతంలో కేసీఆర్‌కు ఇక్కడ ఊరు లేకపోయినా, పార్లమెంటులో నోరు లేకపోయినా రాజకీయ వలస వచ్చాడని, అయినప్పటికీ ఇక్కడి ప్రజలు ఆయన్ను గుండెల్లో పెట్టుకున్నారని గుర్తుచేశారు. ఒక తల్లిగా ఇక ఏ తల్లికి గుండెకోత ఉండొద్దనే ఉద్దేశంతోనే సోనియమ్మ తెలంగాణ రాష్ట్రాన్ని ఏర్పాటు చేశారని, కానీ కేసీఆర్

..మిగతా 2లో

# నేడు కోహెడలో పండ్ల మార్కెట్‌కు సీఎం శంకుస్థాపన

**రైతుల కోసం అంతర్జాతీయ సదుపాయాలతో ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణం**
**మార్కెట్ కోసం 239 ఎకరాలు ఇచ్చిన రైతులకు మంత్రి కృతజ్ఞతలు**
**వ్యవసాయ రంగ అభివృద్ధికి కొత్త మౌలిక సదుపాయాలు ఏర్పాటు**
**అంతర్జాతీయ పరిస్థితుల వల్ల వ్యవసాయంపై ప్రభావం ఉందని వ్యాఖ్య**
**ఎరువుల కొరతకు పశ్చిమాసియా యుద్ధం కారణమని వివరణ**
**దిగుమతి సుంకాల తగ్గింపుతో రైతులకు నష్టం జరుగుతోందని ఆందోళన**
**పత్తి, పామాయిల్ ధరలు తగ్గడంతో దేశీయ రైతులపై ప్రభావం**
**ధాన్యం కొనుగోళ్లలో డీజిల్ సరఫరా సమస్యలు ఎదురయ్యాయని వెల్లడి**

**హైదరాబాద్, (డిడి9 వార్త):** కోహెడలో పండ్ల మార్కెట్ నిర్మాణానికి శనివారం సాయంత్రం 5 గంటలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేయనున్నారని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి నాగేశ్వరావు తెలిపారు. సీఎం పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లను పరిశీలించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు.

రాష్ట్ర రైతుల అవసరాలకు అనుగుణంగా అంతర్జాతీయ స్థాయి సదుపాయాలతో ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌ను నిర్మించనున్నట్లు మంత్రి చెప్పారు. ఈ మార్కెట్ రైతులకు ఆధునిక నిల్వ, రవాణా, విక్రయ సౌకర్యాలు కల్పించనుందని వివరించారు. ఈ ప్రాజెక్టు కోసం 239 ఎకరాల భూమిని రైతులు అందించారని, వారి సహకారానికి ప్రభుత్వం కృతజ్ఞతలు తెలియజేస్తోందని మంత్రి పేర్కొన్నారు. రైతుల భాగస్వామ్యంతోనే ఈ పెద్ద ప్రాజెక్టు సాధ్యమైందని చెప్పారు. అంతర్జాతీయ పరిస్థితులు వ్యవసాయ రంగంపై ప్రభావం చూపుతున్నాయని

..మిగతా 2లో

# అడ్డగోలుగా మాట్లాడొద్దు

**దేశ ఆర్థిక వ్యవస్థపై**
**రాహుల్‌వి నిరాధార వ్యాఖ్యలు**
**స్వార్థ రాజకీయాల**
**కోసం చేసిన అసత్యపు వాదన**
**దేశ ప్రజల్లో లేని**
**భయాందోళనలను రెచ్చగొట్టడమే**
**కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి**

**హైదరాబాద్, (డిడి9 వార్త):** భారత ఆర్థిక వ్యవస్థపై రాహుల్ గాంధీ అడ్డగోలు వ్యాఖ్యలు చేస్తున్నారని, అత్యున్నతస్థాయి సంస్థలపై ఆయన చేసినవి నిరాధార వ్యాఖ్యలని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వం అన్ని షాక్ అబ్జార్బర్‌లను (ఆటంకపరిచే వ్యవస్థలను) తొలగించడం వల్ల భారతదేశం ఆర్థిక సునామీ వైపు వెళ్తున్నదని కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ తన స్వార్థ రాజకీయాల కోసం చేసిన అసత్యపు వాదనలన్నారు. దేశ ప్రజల్లో లేని భయాందోళనలను రెచ్చగొట్టడమేనని పేర్కొన్నారు. ఒకవేళ భారతదేశపు ఆర్థిక వ్యవస్థ షాక్ అబ్జార్బర్‌లను నిజంగానే తొలగించి ఉంటే, అంతర్జాతీయ మార్కెట్‌లో విపరీతంగా పెరిగిన ముడి చమురు ధరలు, పశ్చిమ ఆసియాలో సంఘర్షణ, దిగుమతులు, ఎగుమతులపై సప్లై చైన్‌లో అంతరాయాలు,

..మిగతా 2లో



# బీజేపీ వైపు తెలంగాణ ప్రజల చూపు

**కాంగ్రెస్, బీఆర్ఎస్ పూర్తిగా ఫెయిల్ అయ్యాయి**
**అభివృద్ధికి డబుల్ ఇంజిన్ ప్రభుత్వం అవసరం**
**బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు**
**బీజేపీ కార్యకర్తల శిక్షణ**
**కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్ర అధ్యక్షుడు**
**పర్యావరణ దినోత్సవం సందర్భంగా**
**మొక్కలు నాటిన రాంచందర్‌రావు**
**బీఆర్ఎస్ పాలనపై తీవ్ర విమర్శలు చేసిన బీజేపీ నేత**
**కాంగ్రెస్ ప్రభుత్వంపై అవినీతి ఆరోపణలు**
**రైతు రుణమాఫీ అమలులో లోపాలు ఉన్నాయని వ్యాఖ్య**
**తెలంగాణ ప్రజలు బీజేపీ వైపు ఆశగా చూస్తున్నారని వ్యాఖ్య**
**అభివృద్ధికి డబుల్ ఇంజిన్ సర్కార్ అవసరమని స్పష్టం**
**ఆధునిక సాంకేతికత వినియోగంపై కార్యకర్తలకు సూచన**
**ప్రజలతో ప్రత్యక్ష సంబంధాలు కొనసాగించాలని పిలుపు**
**కేంద్ర పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచన**




**హైదరాబాద్, (డిడి9 వార్త):** తెలంగాణ రాజకీయాల్లో బీజేపీ పాత్రపై పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు వ్యాఖ్యలు కీలకంగా మారాయి. రాష్ట్ర ప్రజలు బీజేపీ వైపు ఆశగా చూస్తున్నారని ఆయన పేర్కొన్నారు. శుక్రవారం జరిగిన బీజేపీ కార్యకర్తల

..మిగతా 2లో

# అధైర్య పడొద్దు.. అండగా ఉంటా

**ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే అమీర్‌పేట అగ్ని ప్రమాదం**
**ఆస్తి నష్టపోయిన వారికి పరిహారం అందజేయాలి**
**బాధితులకు పరామర్శించి, భరోసానిచ్చిన కవిత**



**హైదరాబాద్, (డిడి9 వార్త):** అమీర్‌పేట అగ్ని ప్రమాద బాధితులకు న్యాయం జరిగే వరకు అండగా ఉంటామని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత భరోసా ఇచ్చారు. అగ్ని ప్రమాదం జరిగిన ప్రాంతాన్ని శుక్రవారం కవిత పరిశీలించి ప్రమాదం వివరాలు బాధితులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, అగ్నిప్రమాదానికి ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణమని మండిపడ్డారు. బాధితులు చెబుతున్న వివరాల ప్రకారం ఈ ప్రమాదం అనుకోకుండా జరిగింది కాదని తెలుస్తున్నదన్నారు. ప్రమాదం జరిగిన ప్రాంతం వెనుకల ఉన్నమెస్ కారణంగానే ఈ ప్రమాదం జరిగిందని బాధితులు చెబుతున్న విషయాన్ని ప్రస్తావించారు. గతంలో ఇక్కడ షార్ట్ సర్క్యూట్ జరిగిందని దానిపై

..మిగతా 2లో

# జల హక్కులపై నిర్లక్ష్యం దేనికి?

సోలార్ ఆధారిత విద్యుత్ విధానాలతో సాగునీటి రంగానికి ముప్పు
ఎత్తిపోతల పంపుల నిర్వహణలో నాడు లేఖ ద్వారా హెచ్చరించాం
అయినా కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోలేదు
పంపులు దెబ్బతిని కాళేశ్వరం, దేవాదుల నిర్వహణలో వైఫల్యం
తెలంగాణ జల హక్కులను కాపాడడంలో విఫలం
మాజీ మంత్రి హరీశ్ రావు విమర్శలు



**హైదరాబాద్, (డిడి9 వార్త):** సోలార్ ఆధారిత విద్యుత్ విధానాలతో సాగునీటి రంగానికి ముప్పు వాటిల్లుతుందని మాజీ మంత్రి తన్నీరు హరీశ్ రావు ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం రైతు డిస్కం ప్రతిపాదనను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యంతో తెలంగాణ జల హక్కులకు తీవ్ర ప్రమాదం ఏర్పడిందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు సీఎం రేవంత్ రెడ్డికి శుక్రవారం బహిరంగ లేఖ రాశారు. కాళేశ్వరం గాయత్రి పంపింగ్ స్టేషన్‌తో పాటు దేవాదుల తదితర లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టుల్లో పంపులు, మోటార్లు దెబ్బతిన్నాయని, భారీ మోటార్లను పదేపదే ఆన్ ఆఫ్ చేయడం వల్ల పరికరాలు దెబ్బతింటాయని ముందుగానే తాము హెచ్చరించినప్పటికీ ప్రభుత్వం చర్యలు తీసుకోవడంలో విఫలమైందన్నారు. వేల కోట్ల ప్రజాధనంతో నిర్మించిన కీలక సాగునీటి మౌలిక

..మిగతా 2లో

# భవిష్యత్ కోసం మొక్కలు నాటండి

**కృష్ణకాంత్ పార్క్‌లో మొక్కలు నాటిన మంత్రి పొన్నం ప్రభాకర్**
**ప్రపంచ పర్యావరణ దినోత్సవ కార్యక్రమం నిర్వహణ**
**మొక్కలు నాటి పచ్చదనం పెంపుపై ప్రజలకు మంత్రి పిలుపు**
**99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో ఫారెస్ట్ కార్యక్రమాలు**
**భవిష్యత్తు కోసం ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని సూచన**
**హైదరాబాద్‌లో కాలుష్యం పెరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని వ్యాఖ్య**
**ఈవీ వాహనాల వినియోగంతో కాలుష్యం తగ్గుతుందని అభిప్రాయం**
**నీటి వనరుల సంరక్షణపై ప్రజలకు మంత్రి హెచ్చరిక**
**ప్రతి ఇంట్లో ఇంకుడు గుంతలు ఏర్పాటు చేయాలని సూచన**
**ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాలని మంత్రి పిలుపు**
**ప్రభుత్వ, కార్పొరేషన్ అధికారుల పాల్గొనడంతో కార్యక్రమం నిర్వహణ**



**హైదరాబాద్, (డిడి9 వార్త):** ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా హైదరాబాద్‌లోని కృష్ణకాంత్ పార్క్‌లో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ ఇన్‌ఛార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ పాల్గొని మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ప్రజాపాలన - ప్రగతి ప్రణాళికలో

..మిగతా 2లో

## నేడు కోహెడలో పండ్ల మార్కెట్‌కు సీఎం శంకుస్థాపన

**మొదటిపేజీ తరువాయి**

మంత్రి అన్నారు. పశ్చిమాసియా ప్రాంతంలో కొనసాగుతున్న యుద్ధ పరిస్థితుల వల్ల ఎరువుల సరఫరాలో కొరత ఏర్పడిందని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం పత్తి, పామాయిల్ దిగుమతులపై సుంకాలు తగ్గించడం వల్ల దేశీయ రైతులకు నష్టం జరుగుతోందని ఆయన విమర్శించారు. విదేశీ దిగుమతులు పెరగడంతో స్థానిక ఉత్పత్తులకు ధరలు తగ్గుతున్నాయని తెలిపారు.
డీజిల్ సరఫరాలో సమస్యల కారణంగా ధాన్యం కొనుగోళ్లలో ఇబ్బందులు ఎదురయ్యాయని మంత్రి పేర్కొన్నారు. రవాణా వ్యవస్థపై కూడా దీని ప్రభావం పడిందని చెప్పారు. అయితే రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం పెద్ద ఎత్తున నిధులు విడుదల చేసిందని మంత్రి తెలిపారు. ఇప్పటివరకు రైతుల ఖాతాల్లో లక్ష కోట్ల రూపాయలు జమ చేసినట్లు ఆయన వెల్లడించారు. మొత్తంగా కోహెడ పండ్ల మార్కెట్ రాష్ట్ర వ్యవసాయ రంగానికి కొత్త దిశ చూపుతుందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు.

## అధైర్య పడొద్దు.. అండగా ఉంటా

**మొదటిపేజీ తరువాయి**



మూడు నెలల క్రితమే స్థానికులు ఫిర్యాదు చేసినా.. అధికారులు ఏమాత్రం పట్టించుకోలేదన్నారు. అప్పుడే సరైన చర్యలు తీసుకోని ఉంటే ఇంత ఘోరం జరిగేది కాదన్నారు. ప్రమాదంలో దాదాపు రూ.4కోట్ల ఆస్తినష్టం జరిగిందన్నారు. ఆస్తినష్టంపై సరైన అంచనా వేసి బాధితులందరికీ నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రమాదం జరిగిన గంటంబావు వరకు కూడా ఫైరింజన్లు రాకపోవడం అత్యంత దారుణమన్నారు. సరైన సమయానికి అగ్నిమాపక సిబ్బంది వచ్చి ఉంటే నష్టం చాలా వరకు తగ్గేదన్నారు. అదృష్టవశాత్తు ప్రమాదంలో ఎలాంటి ప్రాణ నష్టం జరగలేదని, కానీ, మళ్లీ ఇలాంటి సంఘటనలు జరిగితే పెద్ద ఎత్తున నష్టం జరిగే ప్రమాదం ఉంటుందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఇలాంటి సంఘటనలపై సీరియస్‌గా దృష్టి పెట్టాలని కవిత సూచించారు.

**దేవ్ జీని పరామర్శించిన కవిత**

మావోయిస్ట్ పార్టీ మాజీ ప్రధాన కార్యదర్శి తిప్పిరి తిరుపతి (దేవ్ జీ)ని టీఆర్ఎస్ చీఫ్ కల్వకుంట్ల కవిత శుక్రవారం పరామర్శించారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో ఉన్న ఆయన కొంపల్లిలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న కవిత స్వయంగా ఆస్పత్రికి వెళ్లి దేవ్ జీని కలిసి ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. వీలైనంత త్వరగా పూర్తి ఆరోగ్యంతో కోలుకుని, సాధారణ జీవితంలోకి అడుగుపెట్టాలని కవిత ఆకాంక్షించారు. దేవ్ జీకి మెరుగైన వైద్య సేవలు అందించాలని డాక్టర్లకు సూచించారు.

## జల హక్కులపై నిర్లక్ష్యం దేనికి?

**మొదటిపేజీ తరువాయి**

వసతులు ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల నష్టపోతుండడం శోచనీయం అన్నారు. ప్రాజెక్టులను బలహీనపరచి ఆ నెపాన్ని గత బీఆర్ఎస్ ప్రభుత్వంపై మోపే ప్రయత్నమా అనే అనుమానం కలుగుతున్నదన్నారు. సోలార్ విద్యుత్ అందుబాటులో ఉండే పగటి వేళల్లోనే లిఫ్ట్ ఇరిగేషన్ పంపులు నడపాలని ట్రాన్స్‌కో సూచించడం వల్ల, భారీ పంపులను తరచూ స్టార్ట్, స్టాప్ చేయాల్సిన పరిస్థితి ఏర్పడుతున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. పంపులు, మోటార్ల నష్టం ఈ విధానాల వల్ల జరిగి ఉంటే కాంగ్రెస్ ప్రభుత్వం బాధ్యత వహించాల్సిందేనని, ఈ నిర్ణయాలకు ముందు సాంకేతిక అధ్యయనం జరిగిందా లేదా అనేది అసలు ప్రశ్న అన్నారు. జీఓ ఎంఎస్ నెంబర్ 8 ద్వారా టీజీఆర్‌పీడీసీఎల్‌కు అధిక పునరుత్పాదక (సోలార్) విద్యుత్ కేటాయింపు, సోలార్ విద్యుత్ ప్రధానంగా ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకే అందుబాటులో ఉంటుందన్నారు. దీంతో లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టుల పంపింగ్ కార్యకలాపాలు పరిమిత సమయానికే కట్టుబడే ప్రమాదం ఉన్నదని ఆందోళన వ్యక్తం చేశారు. నీటి ఎత్తిపోతలు తగ్గి కృష్ణా, గోదావరి జలాల వినియోగ సామర్థ్యం దెబ్బతింటుందని వివరించారు.

**పాలమూరుకు ఎంతో చేశాం..**

కాళేశ్వరం, దేవాదుల, పాలమూరు ఇతర ప్రాజెక్టుల ప్రధాన లక్ష్యం తెలంగాణకు రావాల్సిన కృష్ణా, గోదావరి జలాలను పూర్తిగా వినియోగించుకోవడం, విద్యుత్ లభ్యత ఆధారంగా పంపింగ్‌ను పరిమితం చేయడం రాష్ట్ర జల హక్కులకు విరుద్ధం అని హరీశ్ రావు అన్నారు. నీటి వినియోగం తగ్గితే వ్యవసాయం, తాగునీరు, భూగర్భ జలాలు, చేపల పెంపకం, పరిశ్రమలు, విద్యుత్ ఉత్పత్తి, గ్రామీణ జీవనోపాధిపై తీవ్ర ప్రభావం పడుతుందని తెలిపారు. కాంగ్రెస్ పాలనలో కృష్ణా జలాల వినియోగం కనిష్ట స్థాయికి చేరిందని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణకు కేటాయించిన తాత్కాలిక వాటా 34% కాగా, ఆంధ్రప్రదేశ్‌కు 66% అన్నారు. 2024 25లో ఆంధ్రప్రదేశ్ 72.73% నీటిని వినియోగించగా, తెలంగాణ కేవలం 27.27% మాత్రమే వినియోగించిందన్నారు. 2025 26లో ఆంధ్రప్రదేశ్ వినియోగం 74.90%కి పెరగగా, తెలంగాణ వినియోగం చారిత్రక కనిష్టమైన 25.10%కి పడిపోయిందని మండిపడ్డారు. నీటి లభ్యత అధికంగా ఉన్నప్పటికీ తెలంగాణ తన వాటా నీటిని కూడా పూర్తిగా వినియోగించుకోలేక పోయిందన్నారు. తెలంగాణ జల హక్కులను, రైతుల ప్రయోజనాలను కాపాడడంలో కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యానికి ఇది మరో నిదర్శనంగా పేర్కొన్నారు. కాంగ్రెస్ పాలనలో పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులను రన్నింగ్ ప్రాజెక్టులుగా మార్చింది బీఆర్ఎస్ ప్రభుత్వం అని స్పష్టం చేశారు. కల్వకుర్తి, భీమా, నెట్టెంపాడు, కోయిల్ సాగర్ ప్రాజెక్టుల్లో 2014 వరకు కేవలం 27వేల ఎకరాలే సాగైతే, భూసేకరణ చేసి, ప్రాజెక్టుల పనులు పూర్తిచేసి దాన్ని ఆరున్నర లక్షల ఎకరాలకు పెంచింది తామే అని వెల్లడించారు. పదేళ్ల బీఆర్ఎస్ పరిపాలనలో ఒక్క పాలమూరులోనే మొత్తంగా 10 లక్షల ఎకరాల ఆయకట్టుకు నీళ్లు అందించామన్నారు. 30 నెలల్లో తట్టెడు మట్టి తీయకుండా, ఒక్క చెక్ డ్యాం కట్టకుండా కేసీఆర్ గురించి, బీఆర్ఎస్ పాలన గురించి మాట్లాడడం దారుణమని హరీశ్ రావు పేర్కొన్నారు.



# కేసీఆర్.. దమ్ముంటే చర్చకు రా

**మొదటిపేజీ తరువాయి**

మేకవన్నె పులి అని గుర్తించక ధనిక రాష్ట్రంగా ఉన్న తెలంగాణను రెండుసార్లు ఆయన చేతిలో పెడితే.. పదేళ్ల పాలనలో పాలమూరు జిల్లాలోని ఏ ఒక్క ప్రాజెక్టును కూడా పూర్తి చేయలేదని సీఎం మండిపడ్డారు.
పాలమూరులో గెలిపించినందుకు ఇక్కడి ప్రాజెక్టులు పూర్తి చేయకుండా పారిపోయి గజ్వేల్‌లో పోటీ చేసిన కేసీఆర్ పాలమూరు ద్రోహినా? లేక ఇక్కడే పుట్టి పెరిగిన నేను ద్రోహినా? అని నిలదీశారు. పదేళ్లలో కాళేశ్వరం కోసం లక్ష కోట్లు ఖర్చు చేసిన కేసీఆర్, ఉద్దండపూర్ మునిగిపోతుంటే నిర్వాసితుల కోసం రూ. 800 కోట్లు ఇవ్వలేదని, పైగా న్యాయం అడిగిన నిర్వాసితులను జైల్లో పెట్టి కొట్టించాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. అందుకే "మట్టికి పోయినా మనోడే పోవాలి" అని పెద్దలు చెప్పారని, మీ పాలమూరు బిడ్డగా కేవలం ఈ 30 నెలల కాలంలోనే జిల్లా ప్రాజెక్టుల కోసం రూ. 8 వేల కోట్లు ఖర్చు చేశానని సీఎం వెల్లడించారు. బిఆర్ఎస్ నాయకులు జైళ్లు కట్టాలని చూస్తే.. తాము పేద పిల్లల కోసం స్కూళ్లు కట్టాలని అనుకున్నామని, జిల్లాలో వలసలు ఆగి బతుకులు బాగుపడాలంటే చదువొక్కటే మార్గమని నమ్మి కొడంగల్‌లో భారీ ఎడ్యుకేషన్ హబ్‌ను నిర్మిస్తున్నట్లు పేర్కొన్నారు.
ప్రస్తుత ప్రభుత్వం ఏం చేసిందని విమర్శిస్తున్న వారికి సీఎం రేవంత్ రెడ్డి లెక్కలతో సమాధానమిస్తూ.. తమ రెండున్నరేళ్ల పాలనలో 15 లక్షల కొత్త రేషన్ కార్డులు అందించామని, 4.50 లక్షల ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేశామని, 50 లక్షల కుటుంబాలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ ఇస్తున్నామని, అలాగే మహిళల ఉచిత బస్సు ప్రయాణం కోసం రూ. 10 వేల కోట్లు ఖర్చు చేశామని వివరించారు. తాము చేసిన అభివృద్ధిని చెప్పాలంటే రాస్తే రామాయణం, చెబితే భారతమంత ఉందని, ఈ క్రమంలోనే కేసీఆర్‌కు సవాల్ విసురుతూ.. "నీ పదేళ్ల పాలనపై, మా రెండున్నరేళ్ల పాలనపై చర్చిద్దాం.. నీ పేరు కేసీఆర్ అయితే అసెంబ్లీకి రా, చర్చలో మాది తప్పని తేలితే నేను క్షమాపణ చెబుతా" అని సవాల్ విసిరారు. నిన్నమొన్నటి వరకు దొంగలకు సద్దులు మోసిన వాళ్లు ఇప్పుడు పాదయాత్రలు చేస్తామని మాట్లాడుతున్నారని, వారు పాదయాత్ర కాదు కాశీ దాకా పొర్లుదండాలు పెట్టినా చేసిన పాపాలు తొలిగిపోవని విమర్శించారు.



పంచె కట్టుకుని ఇప్పుడు ఊళ్లలోకి వస్తే ప్రజలు ఉరికించి కొడతారన్న సీఎం, కేసీఆర్ రాసిపెట్టుకో.. పాలమూరు ప్రజలకు మట్టి తీసుడే కాదు, మట్టితో కప్పడం కూడా తెలుసని, రాబోయే రోజుల్లో పాలమూరు జిల్లాలో మీ పార్టీని బొంద పెడతాం, మీ వాళ్లని ఒక్కరిని కూడా ఎమ్మెల్యేగా గెలవనివ్వం అని హెచ్చరించారు. అలాగే గోదావరి జలాలపై చర్చిద్దామంటే మహారాష్ట్ర ముఖ్యమంత్రి దాగుడుమూతలాడుతున్నారని, బీజేపీ నాయకులు ఇక్కడ తప్పించుకు తిరుగుతున్నారని దుయ్యబట్టారు. ఎవరు ఎన్ని డ్రామాలూ ఆడినా తుమ్మిడిహెట్టి కట్టి తీరుతామని, పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి 90 టీఎంసీల నీటిని ఒప్పించే బాధ్యత తనదేనని స్పష్టం చేస్తూ, జిల్లా ప్రాజెక్టులకు గ్రీన్ ఛానల్ ద్వారా నిధులు మంజూరు చేస్తానని భరోసా ఇచ్చారు. రాష్ట్రంలో 2034 వరకు కాంగ్రెస్ పార్టీదే అధికారమని, 2029లో మళ్లీ కాంగ్రెస్‌ను భారీ మెజార్టీతో అధికారంలోకి తెస్తామని చెప్తూ, "ఔర్ ఏక్ బార్.. కాంగ్రెస్ సర్కార్" అనే నినాదంతో సీఎం రేవంత్ రెడ్డి ప్రసంగాన్ని ముగించారు.

## అడ్డగోలుగా మాట్లాడొద్దు

**మొదటిపేజీ తరువాయి**

ఆర్థికంగా ప్రపంచం అనేక రకాల సవాళ్ళు ఎదుర్కొంటున్నప్పటికీ, నిరంతర భౌగోళిక రాజకీయ అనిశ్చితి ఉన్నప్పటికీ భారత ఆర్థిక వ్యవస్థ ఎందుకు నిలకడగా కొనసాగుతున్నదన్నారు. ప్రభుత్వం ఏ రకమైన షాక్ అబ్జార్బర్‌లను తొలగించలేదన్నారు. 140 కోట్ల భారత ప్రజల సహకారంతో గత దశాబ్ద కాలంలో మోదీ నాయకత్వంలో దేశ ఆర్థిక వ్యవస్థను మరింత పటిష్టం చేశారని వెల్లడించారు. ప్రపంచ ముడి చమురు ధరలు పెరిగినప్పుడు, పెట్రోల్, డీజిల్‌పై ఎక్సైజ్ సుంకాల తగ్గింపు వినియోగదారులకు ఊరట ఇచ్చిందని కేంద్ర మంత్రి గుర్తుచేశారు.

**కాంగ్రెస్ హయాంలో**
**రూపాయి విలువ పతనం**

కాంగ్రెస్ నేతృత్వంలోని యూపీఏ ప్రభుత్వం హయాంలో చూసినట్లయితే 2011 నుంచి 2013 మధ్య రూపాయి విలువ 36 శాతం పడిపోయిందన్నారు. విదేశీ మారక నిల్వలు జూలై 2011లో సుమారు 294 బిలియన్ డాలర్ల నుంచి ఆగస్టు 2013 నాటికి దాదాపు 256 బిలియన్ డాలర్లకు తగ్గాయని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తెలిపారు. దిగుమతుల కవరేజ్ మార్చి 2004 నుంచి సెప్టెంబర్ 2013 నాటికి ప్రమాద స్థాయికి పడిపోయిందన్నారు. 20042014 ఆర్థిక సంవత్సరాల మధ్య ద్రవ్యోల్బణం సగటున 8.2 శాతానికి దిగజారిందని విమర్శించారు. 2010 2014 ఆర్థిక సంవత్సరాలలో చాలా కాలం పాటు రెండంకెల స్థాయికి పడిపోయిందని పేర్కొన్నారు. 20092014 ఆర్థిక సంవత్సరాల మధ్య వరుసగా ఆరు సంవత్సరాల పాటు ద్రవ్యలోటు జీడీపీలో 4.5 శాతం లేదా అంతకంటే ఎక్కువగా కొనసాగిందన్నారు. అన్నిటికంటే ముఖ్యంగా మొత్తం వ్యయంలో మూలధన వ్యయం వాటా 20042014 ఆర్థిక సంవత్సరంలో 31 శాతం నుంచి కేవలం 16 శాతానికి పడిపోయిందని విమర్శించారు. ఇదే యూపీఏ హయాంలో 2004 నుంచి 2014 వరకు కాంగ్రెస్ పాలనలో జరిగిన అసలైన షాక్ అబ్జార్బర్ల తొలగింపు అని, రాహుల్ గాంధీ తెలుసుకోవాల్సిన నిజాలు అని, కాంగ్రెస్ దేశాన్ని బలహీనపరిచిందని కిషన్ రెడ్డి ఆగ్రహం వ్యక్తంచేశారు. కనీసం ఇకనైనా, లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడిగా కొనసాగుతున్న రాహుల్ గాంధీ బాధ్యతారహితంగా ప్రపంచంలో భారత ప్రతిష్టను దిగజార్చే విధంగా ప్రవర్తించవద్దని సూచించారు.


**పర్యావరణ పరిరక్షణ ప్రతి పౌరుడి బాధ్యత**

ప్రధానమంత్రి మోదీ 'ఏక్ పేడ్ మా కే నామ్' పిలుపు స్ఫూర్తితో.. అంతర్జాతీయ పర్యావరణ దినోత్సవం సందర్భంగా కిషన్ రెడ్డి ఢిల్లీలోని తన అధికారిక నివాసంలో మొక్క నాటారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రి మాట్లాడుతూ, పర్యావరణ పరిరక్షణ ప్రతి పౌరుడి బాధ్యత అన్నారు. ప్రకృతిని కాపాడటం, భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన, ఆరోగ్యకరమైన పర్యావరణాన్ని అందించడం మనందరి కర్తవ్యమన్నారు. ఇది కేవలం మొక్కలు నాటే కార్యక్రమం మాత్రమే కాదని, అది తల్లిపై గౌరవాన్ని వ్యక్తపరుస్తూనే ప్రకృతిని కాపాడుకోడంపై సమాజంలో అవగాహన పెంపొందించే ఒక మహత్తర ప్రజా ఉద్యమమని తెలిపారు. ప్రకృతి పరిరక్షణ, వాతావరణ మార్పుల దుష్ప్రభావాల నివారణ, జీవవైవిధ్య సంరక్షణ(బయోడైవర్సిటీ) కోసం ప్రతి ఒక్కరూ కనీసం ఒక మొక్కను నాటి దాని సంరక్షణ బాధ్యతను కూడా తీసుకోవాలని సూచించారు.

## నకిలీ విత్తనాలపై అప్రమత్తంగా ఉండాలి బొర్రన్న

**డిడి9 వార్త గుడిహత్నూర్ :**

ఖరీఫ్ సీజన్ ప్రారంభమైన నేపథ్యంలో రైతులు నాణ్యమైన పత్తి విత్తనాలనే కొనుగోలు చేయాలని రైతు స్వరాజ్య వేదిక జిల్లా అధ్యక్షుడు సంగెపు బొర్రన్న సూచించారు. గుడిహత్నూర్ మండలంలోని రైతులతో కలిసి మాట్లాడిన ఆయన, నార్నూర్, బేలా, భీంపూర్, ఇచోడా, బజార్‌హత్నూర్, సిరికొండ తదితర ప్రాంతాల్లో నకిలీ పత్తి విత్తనాల విక్రయాలు జరుగుతున్నట్లు సమాచారం అందిందన్నారు.
నకిలీ విత్తనాల వల్ల మొలక శాతం తగ్గడంతో పాటు పంటలో పూత, కాత సమస్యలు ఎదురయ్యే అవకాశం ఉందని హెచ్చరించారు. రైతులు విత్తనాల ప్యాకెట్లపై లాట్ నంబర్‌ను పరిశీలించి, తప్పనిసరిగా అసలు రసీదు తీసుకోవాలని సూచించారు. పంట కోత వరకు రసీదును భద్రపరచుకోవాలని తెలిపారు.
నకిలీ విత్తనాల సరఫరాపై వ్యవసాయ శాఖ, విజిలెన్స్, టాస్క్‌ఫోర్స్ అధికారులు కఠిన నిఘా పెట్టాలని, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతులు భాస్కర్, దత్తు, గణేష్, భీంరావ్, లాలు తదితరులు పాల్గొన్నారు.



## బీజేపీ వైపు తెలంగాణ ప్రజల చూపు

**మొదటిపేజీ తరువాయి**

శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొని పార్టీ భవిష్యత్ వ్యూహాలపై దిశానిర్దేశం చేశారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ఆయన మొక్కలు నాటారు. పర్యావరణ పరిరక్షణ ప్రతి రాజకీయ నాయకుడి బాధ్యతగా ఉండాలని ఆయన అభిప్రాయపడ్డారు.
అనంతరం మాట్లాడుతూ రాష్ట్రంలో గత ప్రభుత్వాల పాలనపై ఆయన విమర్శలు చేశారు. బీఆర్ఎస్ పాలనలో నిధుల వినియోగం, నియామకాలు, సాగునీటి వ్యవస్థల నిర్వహణలో అనేక వైఫల్యాలు జరిగాయని ఆరోపించారు. అలాగే ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం అవినీతి మరియు నిర్లక్ష్యంతో పాలన సాగిస్తోందని విమర్శించారు. రైతు రుణమాఫీ హామీ పూర్తిగా అమలు కాలేదని ఆయన పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అమలు విషయంలో ప్రభుత్వాలు విఫలమవుతున్నాయని ఆయన అన్నారు.
తెలంగాణ అభివృద్ధికి "డబుల్ ఇంజిన్ సర్కార్" అవసరమని ఆయన స్పష్టం చేశారు. కేంద్రం రాష్ట్రంలో ఒకే పార్టీ పాలన ఉంటే అభివృద్ధి వేగంగా జరుగుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. 2014 తర్వాత దేశంలో అభివృద్ధి మరియు సంక్షేమం సమన్వయంతో ముందుకు సాగుతోందని ఆయన అన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాలు ప్రజల జీవితాల్లో మార్పు తీసుకొస్తున్నాయని పేర్కొన్నారు.
బీజేపీ కార్యకర్తలు ఆధునిక సాంకేతికతను వినియోగించుకోవాలని ఆయన సూచించారు. ముఖ్యంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, సోషల్ మీడియా వేదికలను సమర్థవంతంగా ఉపయోగించాలని చెప్పారు. అదే సమయంలో ప్రజలతో ప్రత్యక్ష సంబంధాలు కొనసాగించడం ముఖ్యమని ఆయన అన్నారు. క్షేత్రస్థాయిలో ప్రజల సమస్యలను తెలుసుకోవాలని కార్యకర్తలకు సూచించారు. శిక్షణ తరగతుల్లో చర్చించిన 12 అంశాలను ప్రజలకు వివరంగా చేరవేయాలని ఆయన తెలిపారు. కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు, బీజేపీ సిద్ధాంతాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. మొత్తంగా, రాష్ట్ర రాజకీయాల్లో బీజేపీ మరింత బలపడేందుకు కార్యకర్తల పాత్ర కీలకమని ఆయన సందేశం ఇచ్చారు.

## భవిష్యత్ కోసం మొక్కలు నాటండి

**మొదటిపేజీ తరువాయి**

భాగంగా 99 రోజుల కార్యక్రమాల్లో 12 రోజుల పాటు అటవీ శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పర్యావరణ పరిరక్షణను ప్రభుత్వం ప్రాధాన్య అంశంగా తీసుకుంటోందని ఆయన పేర్కొన్నారు.
పర్యావరణ దినోత్సవం ఒక్క రోజుకే పరిమితం కాదని, ప్రతి ఒక్కరూ దాన్ని తమ జీవన విధానంలో భాగం చేసుకోవాలని మంత్రి సూచించారు. చరిత్రలో అశోక చక్రవర్తి కాలంలోనే మొక్కలు నాటే సంప్రదాయం ఉన్నదని గుర్తుచేశారు. అదే స్ఫూర్తితో భవిష్యత్తు తరాలకు పచ్చని వాతావరణాన్ని అందించాల్సిన బాధ్యత మన అందరిపై ఉందని చెప్పారు. హైదరాబాద్ నగరాన్ని కాలుష్య రహితంగా ఉంచడం ప్రభుత్వ లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. ఢిల్లీ వంటి నగరాలు తీవ్ర కాలుష్య సమస్యలను ఎదుర్కొంటున్నాయని, అలాంటి పరిస్థితి హైదరాబాద్‌లో రావొద్దని ప్రభుత్వం ముందుగానే చర్యలు తీసుకుంటోందని తెలిపారు.
వాహనాల నుంచి వచ్చే కాలుష్యాన్ని తగ్గించేందుకు ఎలక్ట్రిక్ వాహనాల వినియోగాన్ని పెంచాల్సిన అవసరం ఉందని మంత్రి అన్నారు. ఈవీ వాహనాలు పర్యావరణాన్ని కాపాడడంలో కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు.
నీటి సంరక్షణపై కూడా ఆయన ప్రత్యేకంగా మాట్లాడారు. భవిష్యత్తులో వర్షాలు తగ్గే అవకాశాలు ఉన్నాయని, అందుకే నీటిని పొదుపుగా వాడాల్సిన అవసరం ఉందని చెప్పారు. భూగర్భ జలాలు తగ్గుతున్నాయని, బోర్లు వేసినా నీరు వచ్చే పరిస్థితి తగ్గిపోతుందనే ఆందోళన వ్యక్తం చేశారు.
ప్రతి ఇంట్లో ఇంకుడు గుంతలు ఏర్పాటు చేయడం తప్పనిసరి కావాలని ఆయన సూచించారు. వర్షపు నీటిని భూమిలోకి చేర్చడం ద్వారా భూగర్భ జలాలను పెంచుకోవచ్చని వివరించారు. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాలని, పర్యావరణానికి హాని కలిగించే పదార్థాలను తగ్గించాలని మంత్రి ప్రజలకు పిలుపునిచ్చారు. భూమిలో సహజంగా కలిసిపోయే పదార్థాల వినియోగాన్ని ప్రోత్సహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే నవీన్ యాదవ్, హైదరాబాద్ కలెక్టర్ ప్రియాంక ఆలా, జీహెచ్ఎంసీ కమిషనర్ కర్ణన్, అటవీ శాఖ అధికారులు పాల్గొన్నారు. కార్యక్రమం మొత్తం పచ్చదనం, పర్యావరణ అవగాహనపై దృష్టి సారిస్తూ సాగింది.



# రైతుబంధు కు వేళాయే సారుకేందుకో తెలువదా యే !!

- రైతుల ఖాతాల్లో వెంటనే వానాకాలం రైతుబంధు నిధులు జమ చేయాలి
- రైతు భరోసా కోసం భరోసాతో రైతుల ఎదురుచూపులు
- మృగశిర కార్తె వరకు రైతుబంధు అందజేయాలి
- కాంగ్రెస్ చెప్పింది ఎకరాకు 12 వేలు కాదు - బీఆర్ఎస్ ఇచ్చిన 10 వేలైన ఇయ్యి సారు
- రైతు బంధు/రైతు భరోసా నిధుల విడుదలలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎందుకు ఆలస్యం చేస్తోంది?
- బీఆర్ఎస్ సోషల్ మీడియా జిల్లా నాయకుల డిమాండ్

**అదిలాబాద్ జిల్లా నేరడిగొండ మండలం జూన్ 5 (డిడి 9వార్త)**

తెలంగాణలో వానాకాలం సీజన్ ప్రారంభమైన నేపథ్యంలో రైతుల ఖాతాల్లో తక్షణమే రైతుబంధు నిధులు జమ చేయాలని బీఆర్ఎస్ పార్టీ సోషల్ మీడియా జిల్లా నాయకులు మజర్ డిమాండ్ చేశారు. రైతుల సంక్షేమమే లక్ష్యంగా బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన రైతు బంధు పథకం ద్వారా ప్రతి ఎకరానికి సంవత్సరానికి రూ.10,000 పెట్టుబడి సాయం అందించగా, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రైతులకు ఇచ్చిన హామీల అమలులో పూర్తిగా విఫలమైందని బీఆర్ఎస్ పార్టీ తీవ్రంగా విమర్శించారు. ఎన్నికల సమయంలో రైతులకు మరింత మేలు చేస్తామని ఈసారి రైతుబంధు 10 వేలే వస్తది, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక 12 వేలు వస్తదని చెప్పిన కాంగ్రెస్ పార్టీ, అధికారంలోకి వచ్చాక రైతు బంధు పేరును రైతు భరోసాగా మార్చి ప్రచారం చేసుకోవడమే తప్ప రైతులకు సకాలంలో నిధులు అందించడంలో విఫలమైందని ఆయన అన్నారు. ప్రభుత్వం ప్రకటించిన రైతు భరోసా పథకం కింద ఎకరానికి సంవత్సరానికి రూ.12,000 ఇస్తామని చెప్పినా, అమలులో తీవ్ర జాప్యం జరిగిందని పేర్కొన్నారు. 2025లో విడతల వారీగా నిధులు విడుదల చేయగా, రైతులు నెలల తరబడి ఎదురుచూడాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. అలాగే ప్రభుత్వం 2025లో రూ.9,000 కోట్ల రైతు భరోసా నిధులు విడుదల చేస్తామని ప్రకటించినప్పటికీ, రైతులు సకాలంలో పెట్టుబడి సాయం కోసం ఎదురు చూడాల్సి వచ్చిందన్నారు. మృగశిర కార్తె వరకు ప్రభుత్వం ఎట్టి పరిస్థితుల్లో అయిన రైతుల ఖాతాల్లో రైతుబంధు నిధులు జమ చేయాలని డిమాండ్ చేశారు.

**కాంగ్రెస్ ప్రభుత్వానికి సూటి ప్రశ్నలు:**

ఎగ్గొట్టిన మూడు విడతల రైతుబంధు ఎప్పుడూ ఇస్తారు.

రైతులకు పంటల సాగు ప్రారంభానికి ముందే ఇవ్వాల్సిన పెట్టుబడి సాయం ఎందుకు ఆలస్యంగా అందుతోంది?

ఎన్నికల హామీల ప్రకారం రైతులందరికీ పూర్తి స్థాయిలో రైతు భరోసా అందిందా?

అర్హులైన రైతుల పేర్లు జాబితాల్లో లేకపోవడానికి కారణం ఏమిటి?

రైతు బంధు అమలులో బీఆర్ఎస్ ప్రభుత్వం చూపిన వేగం కాంగ్రెస్ ప్రభుత్వం ఎందుకు చూపలేకపోతోంది?

రైతు భరోసా నిధుల విడుదలపై ప్రభుత్వం పూర్తి శ్వేతపత్రం విడుదల చేయడానికి సిద్ధమా?

అని ప్రశ్నించారు. వ్యవసాయం తెలంగాణ ఆర్థిక




వ్యవస్థకు వెన్నెముక అని చెప్పుకునే కాంగ్రెస్ ప్రభుత్వం, రైతుల విషయంలో మాటలు కాకుండా చేతల్లో చూపాలని డిమాండ్ చేశారు. ఒకపక్క రైతుబంధు వేయక, ఒక పక్క కష్టపడి పండించిన పంటలను కొనుగోలు చేయక కేవలం కాలయాపన చేస్తున్నారన్నారు. ప్రస్తుత వానాకాలం సాగు సీజన్ ప్రారంభమైన నేపథ్యంలో రాష్ట్రంలోని అర్హులైన రైతులందరికీ వెంటనే రైతు భరోసా నిధులు జమ చేసి, రైతుల ఆందోళనకు ముగింపు పలకాలని కోరారు.







# మంజీరా సరిహద్దుల్లో 'ఇసుక' చిచ్చు..

- సర్వేకు మహారాష్ట్ర అధికారుల మొండిచేయి!

**బోధన్, నిజామాబాద్ జిల్లా, జూన్ 05(డీడీ9 వార్త) :**

తెలంగాణ, మహారాష్ట్ర సరిహద్దుల్లో మంజీర నది ఇసుక క్వారీల వ్యవహారం రోజురోజుకూ ముదురుతోంది. ఇరు రాష్ట్రాల భూభాగాల మధ్య నెలకొన్న సరిహద్దు వివాదాన్ని పరిష్కరించేందుకు అధికారులు ఉమ్మడి సర్వే నిర్వహించాలని నిర్ణయించుకున్నప్పటికీ, మహారాష్ట్ర యంత్రాంగం నిర్లక్ష్యం సర్వత్రా చర్చనీయాంశమవుతోంది. షెడ్యూల్ ప్రకారం శుక్రవారం నిర్వహించాల్సిన ఉమ్మడి సర్వేకు తెలంగాణ అధికారులు సమాయత్తమై, సర్వే పరికరాలతో సాలూర మండలం హున్సా, మంజీర సరిహద్దుల్లో గంటల తరబడి వేచి చూశారు. బోధన్ డివిజన్ అధికారుల బృందం అక్కడ పడిగాపులు కాసినా మహారాష్ట్ర వైపు నుంచి కనీసం రెవెన్యూ లేదా సర్వే విభాగాలకు చెందిన అధికారులు రాకపోగా, ఎలాంటి సమాచారం కూడా అందజేయలేదు. ఒకవైపు అధికారికంగా సర్వే అంశం చర్చలో ఉన్నప్పటికీ, క్షేత్రస్థాయిలో మాత్రం ఇసుక మాఫియా పట్ల ఏమాత్రం భయం కనిపించడం లేదు. సర్వే కోసం అధికారులు సరిహద్దు వద్ద ఉన్న విషయాన్ని సైతం లెక్కచేయకుండా, మహారాష్ట్ర వైపు ఉన్న ఇసుక క్వారీ నిర్వాహకులు యథేచ్ఛగా తమ కార్యకలాపాలను కొనసాగించడం గమనార్హం. తెలంగాణ భూభాగంలోకి కూడా చొరబడి ఇసుకను తరలిస్తున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్న తరుణంలో, మహారాష్ట్ర అధికారుల గైర్హాజరు పలు అనుమానాలకు తావిస్తోంది. క్వారీ మాఫియా అండదండలతోనే



మహారాష్ట్ర అధికారులు ఉద్దేశపూర్వకంగానే సర్వేకు మొహం చాటేశారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. సరిహద్దు వివాదం విషయంలో ప్రభుత్వం, ఉన్నతాధికారులు కఠినంగా వ్యవహరించి శాశ్వత పరిష్కారం చూపాలని స్థానికులు కోరుతున్నారు.

# మరణానంతరం వెలుగులు పంచిన పుష్పమ్మ..

- నేత్రదానంతో చాటిన గొప్ప మానవత్వం

**బోధన్, నిజామాబాద్ జిల్లా, జూన్ 05(డీడీ9 వార్త) :**

ఎడపల్లి మండలం మంగళ్ పహాడ్ గ్రామానికి చెందిన పాలకూరల పుష్పమ్మ (86) భౌతికంగా మన మధ్య లేకపోయినా, ఆమె తీసుకున్న నిర్ణయం ఇద్దరి జీవితాల్లో వెలుగులు నింపేందుకు మార్గం సుగమం చేసింది. మరణానంతరం కూడా మానవత్వాన్ని చాటుతూ ఆమె నేత్రాలను దానం చేసి ఆదర్శంగా నిలిచారు. పుష్పమ్మ మృతి చెందిన వెంటనే ఆమె కుటుంబ సభ్యులు కనబరిచిన సేవాభావం అందరినీ కదిలించింది. సమాచారం అందుకున్న వెంటనే లయన్స్ క్లబ్ ఎడపల్లి ప్రతినిధులు, బోధన్ ఐ హాస్పిటల్ వైద్య బృందం స్పందించి, వెంటనే ఆమె నేత్రాలను సేకరించారు. సేకరించిన నేత్రాలను తదుపరి చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని ప్రముఖ ఎల్‌వీ ప్రసాద్ కంటి ఆస్పత్రికి తరలించారు. ఈ సందర్భంగా మంగళ్ పహాడ్ గ్రామానికి చెందిన లయన్ అరుణ్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ, తన అమ్మమ్మ పుష్పమ్మ అకాల మరణం బాధాకరమని, అయితే ఆమె నేత్రదానం ద్వారా అంధకారంలో ఉన్న వారికి చూపును ప్రసాదించే అవకాశం దక్కడం గర్వకారణమని పేర్కొన్నారు. పుష్పమ్మ చూపిన ఈ గొప్ప నిర్ణయం పట్ల స్థానికులు, సేవా సంస్థల ప్రతినిధులు ప్రశంసలు కురిపిస్తున్నారు. మరణానంతరం కూడా జీవితాలకు వెలుగునివ్వచ్చని, నేత్రదానం వంటి మహో



న్నత కార్యక్రమాలపై ప్రజల్లో చైతన్యం రావాలని లయన్స్ క్లబ్ సభ్యులు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రతి ఒక్కరూ ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు.

# సేవా కార్యక్రమాలకు మీడియా సహకారం అభినందనీయం

- పాత్రికేయులను సన్మానించిన బీర్కూర్ లయన్స్ క్లబ్

**బీర్కూర్, జూన్ 05(డిడి9 వార్త):**

సమాజ సేవా కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో పాత్రికేయుల పాత్ర ఎంతో కీలకమని బీర్కూర్ లయన్స్ క్లబ్ సభ్యులు పేర్కొన్నారు. బీర్కూర్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో శుక్రవారం బీర్కూర్ మండలంలోని పాత్రికేయ మిత్రులకు ఘన సన్మాన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షులు సితలే రమేష్ మాట్లాడుతూ, ఎలాంటి లాభాపేక్ష లేకుండా బీర్కూర్ లయన్స్ క్లబ్ చేపడుతున్న సేవా కార్యక్రమాలను ప్రజలకు చేరవేయడంలో పాత్రికేయులు ఎల్లప్పుడూ ముందుంటున్నారని అన్నారు. క్లబ్ నిర్వహిస్తున్న సామాజిక సేవా కార్యక్రమాలకు మీడియా అందిస్తున్న సహకారం అభినందనీయమని కొనియాడారు. పాత్రికేయుల సేవలను గుర్తిస్తూ వారికి



కండువాలు కప్పి, పత్రికా రంగానికి ప్రతీకగా భావించే పెన్నులను అందజేసి ఘనంగా సన్మానించారు. అనంతరం పాత్రికేయ మిత్రులకు పేరు పేరునా హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షులు సితలే రమేష్, సీనియర్ సభ్యులు మేకల విఠల్, ఎం.ఏ. రషీద్, కిషోర్ ప్రభుదాస్, వీరయ్య సేట్ తదితరులు పాల్గొన్నారు. అలాగే మండలంలోని పలువురు పాత్రికేయ మిత్రులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యత: ఉప్లూర్ సర్పంచ్ శైలేందర్

**నిజామాబాద్ జిల్లా, జూన్ 05(డీడీ9 వార్త) :**

కమ్మర్‌పల్లి మండలంలోని ఉప్లూర్ గ్రామంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా పచ్చదనాన్ని పెంపొందించేందుకు ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామ సర్పంచ్ ఏనుగందుల శైలేందర్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో పర్యావరణ పరిరక్షణ ఆవశ్యకతపై విస్తృత చర్చ జరిగింది. ఈ సందర్భంగా గ్రామంలోని పలు ప్రాంతాల్లో మొక్కలు నాటి, వాటిని సంరక్షించాలని ప్రతిజ్ఞ చేశారు. అనంతరం సర్పంచ్ శైలేందర్ మాట్లాడుతూ... రాబోయే తరాలకు కాలుష్య రహిత వాతావరణాన్ని, స్వచ్ఛమైన గాలిని అందించడమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు. నాటిన మొక్కల సంరక్షణ విషయంలో కూడా అంతే బాధ్యతగా వ్యవహరించాలని ఆయన గ్రామస్తులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ సదశివ్, ఈజీఎస్ టీఏ మంజురాణి, ఉపసర్పంచ్ తక్కూరి శేఖర్, జీపీఓ సుమన్, గ్రామ పంచాయతీ కార్యదర్శి సౌందర్య, వార్డు సభ్యులు అజయ్, సంతోష్, రాకేష్, సురేష్, అనిల్, కాంగ్రెస్ నాయకులు బండి ఆంజనేయులు, సదుల్లాతో పాటు అంగన్‌వాడీ టీచర్లు, వీఓఏలు, ఆశా కార్యకర్తలు, ఓబీలు మరియు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.





# పర్యావరణ పరిరక్షణ కు మొక్కలే ఆధారం

**అదిలాబాద్ జిల్లా నేరడిగొండ జూన్ 5 (డిడి 9వార్త)**

మండలంలోని లక్కంపూర్ గ్రామంలో గ్రామపంచాయతీ ఆవరణలో మొక్కలు నాటిన ఎంపీడీవో రమేష్, ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి ఒక్కరు మొక్కలు నాటాలని మొక్కలు నాటి వాటి సంరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని పర్యావరణ సమతుల్యతను కాపాడేందుకు ప్రతి ఒక్కరు మొక్కలు నాటి వాటిని పెంచాలని గ్రామాన్ని పచ్చదనంతో నింపేందుకు గ్రామపంచాయతీ అధికారులు సిబ్బంది స్థానిక ప్రజలతో కలిసి ముందుకు రావాలని పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సెడ్మకి సుజాత గంగాధర్, ఉప సర్పంచ్ పూజ, పంచాయతీ సెక్రెటరీ సునీల్ కుమార్, అంగన్వాడి టీచర్ గోదావరి, ఉపాధి హామీఫీల్డ్ అసిస్టెంట్ లత, గ్రామస్తులు పాల్గొన్నారు.



# ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా బోథ్ లో గ్రామసభ

**ఆదిలాబాద్ జిల్లా ,బోథ్ జూన్ 05(డిడి9 వార్త) :**

ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని బోథ్ గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో నిర్వహించిన గ్రామసభకు జిల్లా పంచాయతీ అధికారి (DPO) రమేష్ , బోథ్ సర్పంచ్ కుర్మే అన్నపూర్ణ మహేందర్ ,బోథ్ బ్లాక్ ఆత్మ చైర్మన్ గొర్ల రాజు యాదవ్,బోథ్ ఎంపీవో రాజ్ కుమార్ .ఈ సందర్భంగా పర్యావరణ పరిరక్షణ, గ్రామ పరిశుభ్రత, మొక్కల పెంపకం, ప్లాస్టిక్ వినియోగ నియంత్రణ వంటి అంశాలపై అవగాహన కల్పించారు. గ్రామాన్ని పచ్చదనంతో నింపేందుకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని పిలుపునిచ్చారు. పర్యావరణ పరిరక్షణ ప్రతి పౌరుడి బాధ్యత అని పేర్కొంటూ, స్వచ్ఛమైన మరియు హరిత గ్రామ నిర్మాణానికి ప్రజలందరూ భాగస్వాములు కావాలని సూచించారు ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ సిబ్బంది, ప్రజాప్రతినిధులు, ఈవో అంజయ్య, మహిళా సంఘాల సభ్యులు, యువకులు మరియు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



# పర్యావరణ హితంగా బషీరాబాద్

- ఘనంగా పర్యావరణ దినోత్సవ వేడుకలు

**నిజామాబాద్ జిల్లా, జూన్ 05(డీడీ9 వార్త) :**

కమ్మర్‌పల్లి మండలంలోని బషీరాబాద్ గ్రామంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా పచ్చదనాన్ని పెంపొందించేందుకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. గ్రామంలోని బస్టాండ్ ప్రాంగణంతో పాటు స్థానిక ఉన్నత పాఠశాల ఆవరణలో సర్పంచ్ జమున మహేష్, ఉపసర్పంచ్ చిలివేరి భుమేశ్వర్ మొక్కలు నాటారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా చేపట్టిన ఈ కార్యక్రమంలో పచ్చని మొక్కలను నాటడం ద్వారా గ్రామంలో ఆరోగ్యకరమైన వాతావరణం కోసం కృషి చేయాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి నవీన్ గౌడ్, వార్డు సభ్యులు రమేష్, రాజు, శేఖర్, లావణ్య, శ్రీనివాస్, రాకేష్, లక్ష్మి, రవిలతో పాటు పంచాయతీ సిబ్బంది, కార్మికులు పాల్గొన్నారు. పర్యావరణ పరిరక్షణ విషయంలో పార్టీలకు అతీతంగా స్పందించిన పలువురు రాజకీయ పార్టీల ముఖ్య నాయకులు సైతం కార్యక్రమంలో భాగస్వాములై, మొక్కల ప్రాముఖ్యతను చాటిచెప్పారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారు నాటిన మొక్కలను సంరక్షించాలని, తద్వారా రాబోయే తరాలకు స్వచ్ఛమైన గాలిని అందించాలని ఆకాంక్షించారు.



## వర్షా కాలంపై పోలీస్ కమిషనర్ సన్నాహక సమీక్ష



**నిజామాబాద్ జిల్లా, జూన్ 05(డీడీ9 వార్త) :**

రాబోయే వర్షాకాలంలో ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు తీసుకోవాల్సిన ముందస్తు చర్యలపై నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి.సాయి చైతన్య శుక్రవారం అధికారులతో సమగ్ర సమీక్షా సమావేశం నిర్వహించారు. కమిషనరేట్ కార్యాలయంలో జరిగిన ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. భారీ వర్షాలు, వరదల సమయంలో ప్రజల ప్రాణాలు, ఆస్తుల రక్షణే పోలీస్ శాఖ ప్రథమ కర్తవ్యమని స్పష్టం చేశారు. ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలోని లోతట్టు ప్రాంతాలు, ప్రమాదకర వంతెనలు, వాగులు, చెరువులు, శిథిలావస్థలో ఉన్న భవనాలను ముందుగానే గుర్తించి నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. వర్షాల వల్ల ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా ముందస్తు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని, రాత్రి వేళల్లో ప్రమాదాలు జరగకుండా ప్రత్యేక పెట్రోలింగ్ నిర్వహించాలని సూచించారు. అత్యవసర సమయాల్లో వేగంగా స్పందించేందుకు ప్రతి స్టేషన్ పరిధిలో రెస్క్యూ బృందాలను సిద్ధంగా ఉంచాలని, లైఫ్ జాకెట్లు, టార్చిలైట్లు, కమ్యూనికేషన్ పరికరాలను అందుబాటులో ఉంచుకోవాలని చెప్పారు. రెవెన్యూ, మున్సిపల్, అగ్నిమాపక, విద్యుత్ శాఖలతో సమన్వయం చేసుకుంటూ సహాయక చర్యలు చేపట్టాలని సీపీ సూచించారు. సోషల్ మీడియా వేదికగా వాతావరణ హెచ్చరికలు ఎప్పటికప్పుడు ప్రజలకు తెలియజేయాలని, వదంతులను నమ్మవద్దని అవగాహన కల్పించాలని తెలిపారు. పోలీసు సిబ్బంది 24 గంటల పాటు అప్రమత్తంగా ఉండి, అత్యవసర సమాచారం అందిన వెంటనే స్పందించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో నిజామాబాద్, ఆర్మూర్, బోధన్, ట్రాఫిక్ ఏసీపీలు ప్రకాష్, వెంకటేశ్వర్ రెడ్డి, శ్రీనివాస్, మస్తాన్ అలీ, ఎస్‌బీ, సీసీఆర్బీ, పీసీఆర్ ఇన్‌స్పెక్టర్లు, పలువురు సీఐలు, ఎస్‌హెచ్‌ఓలు పాల్గొన్నారు.



## పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత: ఎడపల్లి సర్పంచ్ రాంచందర్

**బోధన్, నిజామాబాద్ జిల్లా, జూన్ 05(డీడీ9 వార్త) :**

ఎడపల్లి మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా శుక్రవారం పర్యావరణ పరిరక్షణపై ప్రత్యేక ప్రతిజ్ఞా కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామ సర్పంచ్ కందగట్ల రాంచందర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పంచాయతీ పాలకవర్గం, సిబ్బంది, స్థానిక నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పర్యావరణాన్ని కాపాడుకుంటామని వారంతా ప్రతిజ్ఞ చేశారు. అనంతరం సర్పంచ్ రాంచందర్ మాట్లాడుతూ.. మారుతున్న కాలానికి అనుగుణంగా ప్రకృతిని, పంచభూతాలను సంరక్షించుకోవాల్సిన గురుతర బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన గాలిని, పచ్చని వాతావరణాన్ని అందించడమే లక్ష్యంగా అందరూ మొక్కలు నాటాలని, పర్యావరణాన్ని కాపాడాలని పిలుపునిచ్చారు. ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా నియంత్రించడం, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారానే మనం పర్యావరణాన్ని ఆరోగ్యంగా ఉంచుకోగలమని ఆయన స్పష్టం చేశారు. గ్రామంలో పచ్చదనాన్ని పెంపొందించడానికి గ్రామ పంచాయతీ కట్టుబడి ఉందని, ఇందులో భాగంగా అన్ని రకాల చర్యలు చేపడుతున్నామని వెల్లడించారు. ఈ మహత్తర ఆశయ సాధనలో గ్రామస్తులందరూ భాగస్వాములు కావాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ మచ్చూరి గంగాధర్, గ్రామ పంచాయతీ కార్యదర్శి గంగాధర్, వార్డు సభ్యులు, జీపీ సిబ్బంది, స్థానిక ప్రజాప్రతినిధులు మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.



## ఆర్మీలో ఎంపికైన ఈశ్వర్‌కు ఘన సన్మానం

**బోధన్, నిజామాబాద్ జిల్లా, జూన్ 05(డీడీ9 వార్త) :**

సాలూర మండలం ఖాజాపూర్ గ్రామానికి చెందిన ఇందరు ఈశ్వర్ భారత ఆర్మీలో 'అగ్నివీర్'గా ఎంపికవ్వడం పట్ల గ్రామస్తుల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. ఈ సందర్భంగా ఎన్ఎస్‌యూఐ బోధన్ నియోజకవర్గ అధ్యక్షులు అనిల్ కుమార్ చిద్రపు ఆధ్వర్యంలో ఈశ్వర్‌ను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో అనిల్ కుమార్ మాట్లాడుతూ.. గ్రామం నుంచి తొలిసారిగా భారత ఆర్మీలో ఎంపిక కావడం ఎంతో గర్వకారణమని, ఈశ్వర్ సాధించిన ఈ విజయం యువతకు ఎంతో స్ఫూర్తిదాయకమని కొనియాడారు. ఈశ్వర్ సేవల వల్ల గ్రామానికి మంచి గుర్తింపు లభిస్తుందని ఆకాంక్షించారు. దేశ సేవలో ఈశ్వర్ మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆయన కోరారు. ఈ సన్మాన కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ నాగయ్య, ఉప సర్పంచ్ శ్రీనివాస్, చిద్రపు గంగారాం, గ్రామ పంచాయతీ కార్యదర్శి శైలజ, విఠల్, నీలపు హన్మంతు, శ్రీకాంత్, పవన్ తదితర నాయకులు, గ్రామస్తులు పాల్గొని ఈశ్వర్‌ను అభినందించారు.



# పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత......

**మెదక్ జూన్ 05 (డీడీ9 వార్త)**

ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల్లో భాగంగా ప్రపంచ పర్యావరణ దినోత్సవం కార్యక్రమం శుక్రవారం మెదక్ పట్టణంలోని మల్లం చెరువు కట్ట పైన నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ రాధిక, వైస్ చైర్మన్ దొంతి నరేష్ గౌడ్ తో కలిసి మొక్క లను నాటారు. అనంతరం వారు మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరు భాగస్వామ్యం కావాలని, ఇందులో భాగంగానే ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పరిరక్షించే విధంగా కృషి చేయాలన్నారు. వాతావరణ సమతుల్యతను కాపాడటంలో చెట్ల పాత్ర ఎంతో కీలకమని పేర్కొన్నారు. పర్యావరణ పరిరక్షణ తో పాటు భవిష్యత్ తరాలకు




ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించడం కోసం మొక్కలు నాటాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ నవీన్, కౌన్సిలర్స్ గౌస్ కురిషి, శాంసున్నిసబేగం, మున్సిపల్ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు



## ఎడపల్లిలో వారంతపు మేకల సంత ప్రారంభం

**బోధన్, నిజామాబాద్ జిల్లా, జూన్ 05(డీడీ9 వార్త) :**

ఎడపల్లి మండల కేంద్రంలోని నయాబాద్ ప్రాంతంలో శుక్రవారం నుంచి వారంతపు మేకల సంత అందుబాటులోకి వచ్చింది. గ్రామ సర్పంచ్ కందగట్ల రాంచందర్ ప్రత్యేక పూజలు నిర్వహించి సంతను లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... గతంలో మండల ప్రజలు మేకలు, గొర్రెల కొనుగోలు కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సి వచ్చేదని, ఇకపై ఆ ఇబ్బందులు తప్పాయని పేర్కొన్నారు. నిజామాబాద్‌బోధన్ ప్రధాన రహదారి పక్కనే ఈ సంతను ఏర్పాటు చేయడం వల్ల వ్యాపారులకు, పశువుల కాపరులకు ఎంతో సౌకర్యవంతంగా ఉంటుందని తెలిపారు.

స్థానిక ప్రజలు, వ్యాపారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, ప్రతి శుక్రవారం నిర్వహించే ఈ సంత వల్ల గ్రామ పంచాయతీకి అదనపు ఆదాయం కూడా సమకూరుతుందని ఆయన వివరించారు. సంత ఏర్పాటుకు అనుమతులు మంజూరు చేసిన స్థానిక ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు పొద్దుటూరి సుదర్శన్ రెడ్డి, జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి, జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్, బోధన్ డివిజనల్ పంచాయతీ అధికారి నాగరాజుకు సర్పంచ్ ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ మచ్చుకూరి గంగాధర్, సహకార సంఘం అధ్యక్షుడు పోలా మలక రెడ్డి, జిల్లా పరిషత్ మాజీ ఉపాధ్యక్షురాలు రజిత ఎల్లయ్య యాదవ్, మాజీ ఎంపీటీసీ మనిషారెడ్డి, నాయకులు న్యావనంది సుభాష్, జనగాం మోహన్ రెడ్డి, మల్లెపూల శ్రీనివాస్, వార్డు సభ్యులు దండి శంకర్, ముస్తాక్, ఇలియాస్, కార్యదర్శి గంగాధర్, సిబ్బంది, ప్రజాప్రతినిధులు మరియు గొర్రెల, మేకల యజమానులు పాల్గొన్నారు.



## అక్రమ ఇసుక నిల్వలపై ఉక్కుపాదం..

- **పట్టా భూముల్లో నిల్వ చేస్తే పాస్‌బుక్కులు రద్దు!**

**బోధన్, నిజామాబాద్ జిల్లా, జూన్ 05(డీడీ9 వార్త) :**

అక్రమంగా నిల్వ ఉంచిన ఇసుకపై రెవెన్యూ, పోలీస్ యంత్రాంగం ఉక్కుపాదం మోపింది. రెంజల్ మండలం నీలా శివారులోని పంట పొలాల్లో ఇసుకను అక్రమంగా నిల్వ ఉంచారన్న పక్కా సమాచారంతో అధికారులు మెరుపుదాడులు నిర్వహించి, ఆ నిల్వలను సీజ్ చేసి ప్రభుత్వ పరం చేశారు. స్వాధీనం చేసుకున్న ఈ ఇసుకను అంగన్‌వాడీ కేంద్రాలు, గ్రామ పంచాయతీ భవన నిర్మాణాల వంటి ప్రభుత్వ అవసరాలకు వినియోగించాలని నిర్ణయించారు. బోధన్ మండల పోలీసుల బందోబస్తు నడుమ ఈ ఇసుకను తరలిస్తుండగా, కొందరు వ్యక్తులు అడ్డుకునేందుకు ప్రయత్నించారు. దీనిపై అధికారులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ విధి నిర్వహణలో ఉన్న అధికారులను అడ్డుకోవడమే కాకుండా ప్రభుత్వ ఆస్తులను రక్షించకుండా అడ్డుపడే వారిపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సందర్భంగా అధికారులు భూ యజమానులకు గట్టి హెచ్చరికలు జారీ చేశారు. ఇకపై ఎవరైనా తమ సొంత పట్టా భూముల్లో అక్రమంగా ఇసుక నిల్వలు చేస్తే, వారి పట్టా పాస్‌బుక్కులను తక్షణమే రద్దు చేస్తామని, అక్రమదారులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘించే ఎవరినీ ఉపేక్షించే ప్రసక్తే లేదని అధికారులు స్పష్టం చేశారు.




## అంబం (వై)లో ఘనంగా ప్రపంచ పర్యావరణ దినోత్సవం

**బోధన్, నిజామాబాద్ జిల్లా, జూన్ 05(డీడీ9 వార్త) :**

ఎడపల్లి మండలం అంబం (వై) గ్రామంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. గ్రామ పంచాయతీ ఆవరణలో సర్పంచ్ స్రవంతి, ఉప సర్పంచ్ కాకయ్య, గ్రామ కార్యదర్శి నిఖిత ఆధ్వర్యంలో ప్రజాప్రతినిధులు, సిబ్బంది, ఉపాధి హామీ కూలీలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు పంచాయతీ ప్రాంగణంలో పలు రకాల మొక్కలను నాటారు. పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని, నాటిన మొక్కలను కంటికి రెప్పలా కాపాడి, భవిష్యత్ తరాలకు పచ్చని ప్రకృతిని అందించాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు కె.సంతోషి, గైని నాగరాజు, జెల్ల అశోక్, మెరుగు సంతోష్, గొనె సంజీవ్, ఫీల్డ్ ఆఫీసర్ గైని లక్ష్మణ్, ఉపాధి హామీ పథకం కూలీలు, గ్రామస్తులు పాల్గొన్నారు.



## ఎరువుల లభ్యతపై ప్రత్యేక దృష్టి సారించాలి : సహకార అధికారి శ్రీనివాస్‌రావు

**బోధన్, నిజామాబాద్ జిల్లా, జూన్ 05(డీడీ9 వార్త) :**

రాబోయే పంట కాలంలో రైతులకు ఎరువుల కొరత తలెత్తకుండా చూడటమే లక్ష్యంగా సహకార సంఘాలు ముందస్తు చర్యలు చేపట్టాలని జిల్లా సహకార అధికారి శ్రీనివాస్‌రావు అధికారులను ఆదేశించారు. బోధన్‌లోని రైతు వేదికలో ఏర్పాటు చేసిన డివిజన్ స్థాయి సమీక్షా సమావేశంలో ఆయన పాల్గొని పలు కీలక సూచనలు చేశారు. బోధన్‌లోని రైతు వేదికలో జరిగిన ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఎఫ్‌పీఓలుగా ఎంపికైన ఐదు సంఘాల భవిష్యత్ కార్యాచరణను ఖరారు చేయాలని, సంస్థాగత బలోపేతానికి కృషి చేయాలని అధికారులకు సూచించారు. రైతులు సంప్రదాయ సాగు పద్ధతులకు స్వస్తి పలికి, నానో యూరియా, నానో డీఏపీ వంటి ఆధునిక ఎరువుల వినియోగంపై ఆసక్తి చూపేలా క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. ప్రస్తుతం వాతావరణంలో చోటుచేసుకుంటున్న ఎల్‌నీనో ప్రభావాల దృష్ట్యా, పంట మార్పిడి ఆవశ్యకతను రైతులకు వివరించాలని, తక్కువ నీటితో పండే పంటల సాగుకు వారిని ప్రోత్సహించాలని సహకార సంఘాలకు దిశానిర్దేశం చేశారు. ఈ సమావేశంలో అసిస్టెంట్ రిజిస్ట్రార్లు రవీందర్, రమావతి, పోషన్న, సీనియర్ ఇన్‌స్పెక్టర్లు అరుణ్, పుష్ప, రియాజ్, శంకర్, అలీతో పాటు డివిజన్ స్థాయి సహకార సంఘాల కార్యదర్శులు శ్రీనివాస్‌చారి, బాబా, హన్మంత్ రావు, సంజీవ్, హన్మాండ్లు తదితరులు పాల్గొన్నారు.




## అంకితభావంతో పనిచేసిన కార్యదర్శులకు ఘనంగా వీడ్కోలు

**బోధన్, నిజామాబాద్ జిల్లా, జూన్ 05(డీడీ9 వార్త) :**

ప్రభుత్వ సాధారణ బదిలీల ప్రక్రియలో భాగంగా బదిలీపై వెళ్తున్న గ్రామ పంచాయతీ కార్యదర్శులు శ్రీనివాస్, హరిత సేవలను మందర్న, సాలంపాడ్ గ్రామస్తులు ప్రశంసలతో ముంచెత్తారు. గత ఐదారేళ్లుగా ఎంతో అంకితభావంతో తమ విధులను నిర్వర్తించి, గ్రామాల్లో అభివృద్ధి పనులను సక్రమంగా నిర్వహించిన వీరికి గ్రామస్తులు హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు. జీవో నెంబర్ 38 ప్రకారం చేపట్టిన ఈ బదిలీల ప్రక్రియలో మందర్న గ్రామ పంచాయతీ కార్యదర్శిగా పనిచేసిన శ్రీనివాస్ ఎడపల్లి మండలంలోని బ్రాహ్మణపల్లికి, సాలంపాడ్ కార్యదర్శిగా ఉన్న హరిత బోధన్ మండలంలోని మావంది కలాం గ్రామానికి బదిలీ అయ్యారు. తమ హయాంలో గ్రామాల్లో ఎలాంటి లోటుపాట్లు లేకుండా, పాలనను పారదర్శకంగా అందించారని స్థానికులు వారిని కొనియాడారు. బదిలీపై వెళ్తున్న కార్యదర్శులకు గ్రామస్తులు, ప్రజాప్రతినిధులు ఘనంగా వీడ్కోలు పలికి, వారి తదుపరి విధుల్లోనూ మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

## నేటి నుంచి ఆఫ్ఘన్‌తో టెస్ట్ మ్యాచ్..
## కోచ్ గంభీర్ కొత్త వ్యూహాలు

- **టెస్టుల్లో దేవదత్ పడిక్కల్ కంటే సాయి సుదర్శన్‌కే ప్రాధాన్యత**
- **సాయి సుదర్శన్‌కు గతంలో సరైన అవకాశాలు రాలేదన్న గంభీర్**
- **శ్రీలంక పర్యటనకు నలుగురు స్పిన్నర్లను సిద్ధం చేస్తామని వెల్లడి**
- **వైస్ కెప్టెన్సీ కోల్పోయిన రిషభ్ పంత్‌కు మద్దతుగా కీలక సూచనలు**
- **మ్యాచ్ పరిస్థితులను బట్టి ఆడటం పంత్ నేర్చుకోవాలని హితవు**

**డిడి9 వార్త:**

టీమిండియా హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్, తన మార్క్ నిర్ణయాలతో జట్టు ప్రక్షాళనకు శ్రీకారం చుట్టాడు. ఆఫ్ఘనిస్థాన్‌తో ఏకైక టెస్ట్ మ్యాచ్ ప్రారంభానికి ముందు శుక్రవారం మీడియా సమావేశంలో మాట్లాడిన గంభీర్, పలు కీలక విషయాలపై స్పష్టతనిచ్చాడు. ముఖ్యంగా టెస్టుల్లో మూడో స్థానం కోసం యువ ఆటగాడు సాయి సుదర్శన్‌కు తన పూర్తి మద్దతు ఉంటుందని, అతడికే ప్రాధాన్యత ఇస్తానని స్పష్టం చేశాడు.

ఈ సందర్భంగా గంభీర్ మాట్లాడుతూ.. "సాయి సుదర్శన్‌కు గతంలో సరైన అవకాశాలు రాలేదు, అతడికి న్యాయం జరగలేదు. అతను ఎక్కువగా ఇంగ్లండ్‌లో ఆడాడు. కేవలం 45 మ్యాచ్‌ల ప్రదర్శన ఆధారంగా ఒక ఆటగాడిని అంచనా వేయలేం. ఐపీఎల్‌లో అతను 700 పరుగులు చేశాడు. అతడి ఫామ్ అద్భుతంగా ఉంది. అందువల్ల దేవదత్ పడిక్కల్ కంటే ముందు సుదర్శన్‌కు సరైన అవకాశం ఇవ్వాల్సిన అవసరం ఉంది" అని స్పష్టం చేశాడు. దీంతో ఆఫ్ఘనిస్థాన్‌తో జరిగే టెస్టులో సుదర్శన్ ఆడటం దాదాపు ఖాయమైంది.

రాబోయే శ్రీలంక పర్యటన గురించి గంభీర్ తన ప్రణాళికలను వివరించాడు. లంక పర్యటనకు నలుగురు స్పిన్నర్లతో వెళతామని, ప్రస్తుతం జట్టులో నాలుగో స్పిన్నర్ స్థానం కోసం మానవ్ సుతార్, హర్ష్ దూబే మధ్య పోటీ ఉందని తెలిపాడు. ఆఫ్ఘనిస్థాన్‌తో జరిగే ఈ మ్యాచ్ వారిద్దరిలో ఎవరు మెరుగ్గా రాణిస్తారో అంచనా వేయడానికి ఒక అవకాశమని అన్నాడు. "మానవ్, హర్ష్ బౌలింగ్ శైలిలో కొన్ని సారూప్యతలు, కొన్ని తేడాలు ఉన్నాయి. ఈ మ్యాచ్ ద్వారా నాలుగో స్పిన్నర్‌ను ఎంపిక చేస్తాం" అని పేర్కొన్నాడు. న్యూజిలాండ్ వంటి పర్యటనలకు సన్నద్ధత భిన్నంగా ఉంటుందని, అవసరమైతే టెస్టుల కోసం వన్డే రెగ్యులర్ ఆటగాళ్లను కూడా జట్టులోకి తీసుకుంటామని తెలిపాడు.

ఇటీవల టెస్ట్ వైస్ కెప్టెన్సీ కోల్పోయిన రిషభ్ పంత్ విషయంపైనా గంభీర్ స్పందించాడు. "రిషభ్ పంత్ తన సహజమైన ఆటను మార్చుకోవాలని మేము కోరుకోవడం లేదు. కానీ, అంతర్జాతీయ క్రికెట్‌లో మ్యాచ్ పరిస్థితులకు అనుగుణంగా ఆడటం, వాటిని గౌరవించడం చాలా ముఖ్యం. ఈ విషయాన్ని పంత్ గ్రహించాలి" అని హితవు పలికాడు. పంత్‌కు తన మద్దతు ఎల్లప్పుడూ ఉంటుందని, అయితే ఆటలో మరింత పరిణతి చూపించాల్సిన అవసరం ఉందని సూచించాడు.



## ఐపీఎల్ 2026 ఫైనల్ తర్వాత...
## ట్రక్కు కిందకు దూసుకెళ్లిన కారు..
## ప్రాణాలతో బయటపడ్డ ఆసీస్ మాజీ కెప్టెన్

- **ఐపీఎల్ ఫైనల్ తర్వాత కారు ప్రమాదానికి గురైన మైఖేల్ క్లార్క్**
- **ట్రక్కు కిందకు దూసుకెళ్లిన కారు.. స్వల్ప గాయాలతో బయటపడ్డ క్లార్క్**
- **నిద్రలో ఉండగా ప్రమాదం జరిగిందని వెల్లడి**
- **సహాయం చేసిన భారతీయులకు, బీసీసీఐకి కృతజ్ఞతలు తెలిపిన క్లార్క్**



**డిడి9 వార్త:**

ఆస్ట్రేలియా మాజీ కెప్టెన్, ప్రముఖ క్రికెట్ వ్యాఖ్యాత మైఖేల్ క్లార్క్‌కు తృటిలో పెను ప్రమాదం తప్పింది. ఐపీఎల్ 2026 ఫైనల్ ముగిసిన అనంతరం అహ్మదాబాద్‌లో ఆయన ప్రయాణిస్తున్న కారు ఘోర ప్రమాదానికి గురైంది. ఈ ఘటనలో తాను స్వల్ప గాయాలతో సురక్షితంగా బయటపడ్డానని క్లార్క్ స్వయంగా వెల్లడించాడు.

మే 31న రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు, గుజరాత్ టైటాన్స్ మధ్య జరిగిన ఐపీఎల్ ఫైనల్‌కు వ్యాఖ్యాతగా వ్యవహరించిన క్లార్క్, అనంతరం విమానాశ్రయానికి బయలుదేరాడు. మార్గమధ్యలో తాను నిద్రలోకి జారుకున్నానని, మెలకువ వచ్చేసరికి తన కారు ముందు భాగం ఒక సెమీ ట్రక్కు కింద ఇరుక్కుపోయి ఉందని ఆయన తెలిపాడు. బ్రేక్ లైట్లు పనిచేయని ట్రక్కును తమ కారు వెనుక నుంచి ఢీకొట్టడంతో ఈ ప్రమాదం సంభవించిందని క్లార్క్ వివరించాడు. 'బియాండ్ 23 క్రికెట్ పాడ్‌కాస్ట్'లో ఈ వివరాలను పంచుకున్నాడు.

"ఈ ప్రమాదంలో కారు పూర్తిగా ధ్వంసమైంది. నిద్రలో నుంచి ఒక్కసారిగా ఉలిక్కిపడి లేచేసరికి, కారు ముందు భాగం ట్రక్కు కింద ఉండటం చూసి దిగ్భ్రాంతికి గురయ్యాను" అని క్లార్క్ పేర్కొన్నాడు. ఈ ఘటనలో తనకు స్వల్ప గాయాలయ్యాయని, అయితే డ్రైవర్ కాలు విరిగి ఉండవచ్చని ఆయన ఆందోళన వ్యక్తం చేశాడు. ఆ కారు ఒక సంస్థకు చెందినది కావడంతో, డ్రైవర్ తీవ్ర భయాందోళనకు లోనయ్యాడని క్లార్క్ తెలిపాడు.

ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు స్పందించి సహాయం అందించారని క్లార్క్ వెల్లడించాడు. "భారత్‌లో ఉన్న ఉదార స్వభావం గల ప్రజల వల్లే నేను సురక్షితంగా ఇంటికి చేరుకోగలిగాను" అని పేర్కొన్నాడు. తన యోగక్షేమాల గురించి ఆరా తీసిన బీసీసీఐ అధికారులకు కూడా ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపాడు. ఐపీఎల్ 2026 సీజన్ ఆద్యంతం వ్యాఖ్యాతగా వ్యవహరించిన క్లార్క్, ఫైనల్ ముగిసిన కొద్ది గంటలకే ఈ ప్రమాదానికి గురయ్యాడు.

# వెలుతురు తగ్గినా ఆగని టెస్టులు...
## పింక్ బాల్ ప్రయోగంపై గంభీర్ ఏమన్నాడంటే?

- **టెస్టుల్లో బ్యాడ్ లైట్ సమస్యకు ఐసీసీ కొత్త పరిష్కారం**
- **రెడ్ బాల్ స్థానంలో పింక్ బాల్ వాడకంపై ప్రయోగం**
- **ఇది సానుకూల నిర్ణయమన్న టీమిండియా హెడ్ కోచ్ గంభీర్**
- **వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ వంటి కీలక మ్యాచులకు మేలు**
- **అక్టోబర్ 1 నుంచి ఈ కొత్త నిబంధన ట్రయల్స్**



**డిడి9 వార్త:**

టెస్టు క్రికెట్‌లో వెలుతురు లేమి (బ్యాడ్ లైట్) కారణంగా ఓవర్లు నష్టపోకుండా ఉండేందుకు అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ (ఐసీసీ) చేపట్టిన నూతన ప్రయోగానికి భారత జట్టు ప్రధాన కోచ్ గౌతమ్ గంభీర్ మద్దతు ప్రకటించాడు. మ్యాచ్ మధ్యలో రెడ్ బాల్ స్థానంలో పింక్ బాల్‌ను ఉపయోగించేందుకు అనుమతించడాన్ని గంభీర్ ఒక సానుకూల పరిణామంగా అభివర్ణించాడు. మ్యాచ్ ఫలితాలను రాబట్టేందుకు ఇది ఒక గొప్ప అవకాశమని అతడు పేర్కొన్నాడు.

న్యూచండీగఢ్ వేదికగా శనివారం నుంచి ఆఫ్ఘనిస్థాన్‌తో జరగనున్న ఏకైక టెస్టు మ్యాచ్‌కు ముందు గంభీర్ మీడియాతో మాట్లాడాడు. "మ్యాచ్ ఫలితం తేలే అవకాశం ఉన్నప్పుడు అటువంటి నిర్ణయాలకు పూర్తి మద్దతు ఇవ్వాలనేది నా అభిప్రాయం. ఉదాహరణకు, ప్రపంచ టెస్ట్ ఛాంపియన్‌షిప్ ఫైనల్‌కు చేరాలంటే మీరు ఆడే చివరి టెస్టులో తప్పక గెలవాల్సిన పరిస్థితి ఉందనుకోండి. ఒకవేళ వెలుతురు సరిగా లేకపోవడం వల్ల ఆ మ్యాచ్ డ్రాగా ముగిస్తే ఎంతటి నష్టం జరుగుతుందో ఆలోచించండి. అందుకే ఐసీసీ తీసుకున్న ఈ నిర్ణయాన్ని నేను స్వాగతిస్తున్నాను" అని వివరించాడు.

ఐసీసీ తాజాగా ఆమోదించిన ఈ ప్రయోగాత్మక నిబంధన ప్రకారం, టెస్టు మ్యాచ్‌లు యథావిధిగా సంప్రదాయ రెడ్ బాల్‌తోనే ప్రారంభమవుతాయి. అయితే, ప్రతికూల వాతావరణం కారణంగా వెలుతురు తగ్గే అవకాశం ఉందని భావిస్తే, ఇరు జట్ల కెప్టెన్లు ముందుగానే అంగీకరించిన మేరకు పింక్ బాల్‌ను ఉపయోగించవచ్చు. దీనివల్ల ఫ్లడ్‌లైట్ల వెలుతురులోనూ ఆటను నిరంతరాయంగా కొనసాగించడం సాధ్యమవుతుంది.

ఆట మధ్యలో వేరొక బంతికి మారడం ఆటగాళ్లకు కొంత సవాలుతో కూడుకున్న విషయమేనని గంభీర్ అంగీకరించాడు. "అయినప్పటికీ, రెండేళ్ల కష్టాన్ని దృష్టిలో ఉంచుకుంటే ఇది ఒక సానుకూల ముందడుగు. అన్ని జట్లు దీనిని సానుకూల దృక్పథంతో స్వీకరిస్తాయని ఆశిస్తున్నాను" అని తెలిపాడు. ఈ నూతన నిబంధన అక్టోబర్ 1 నుంచి ప్రయోగాత్మకంగా అమల్లోకి వచ్చే అవకాశం ఉంది.

## శ్రీలంక చేరుకున్న తిలక్ వర్మ, వైభవ్ సూర్యవంశీ, ఇతర ఆటగాళ్లు...

- **ముక్కోణపు వన్డే సిరీస్ కోసం శ్రీలంక వెళ్లిన భారత 'ఏ' జట్టు**
- **తిలక్ వర్మ కెప్టెన్‌గా వ్యవహరించనున్న ఈ జట్టులో రుతురాజ్ గైక్వాడ్ వైస్ కెప్టెన్**
- **జూన్ 9 నుంచి 21 వరకు దంబుల్లా వేదికగా టోర్నీ**
- **భారత్, శ్రీలంక, ఆఫ్ఘనిస్థాన్ దేశాల 'ఏ' జట్లతో టోర్నీ**
- **గాయం కారణంగా రియాన్ పరాగ్ సిరీస్‌కు దూరం**

**డిడి9 వార్త:**

శ్రీలంకలో జరగనున్న 50 ఓవర్ల ముక్కోణపు సిరీస్ కోసం తిలక్ వర్మ సారథ్యంలోని భారత 'ఏ' జట్టు లంక గడ్డపై అడుగుపెట్టింది. జూన్ 9 నుంచి 21 వరకు దంబుల్లాలోని రంగిరి అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో ఈ టోర్నమెంట్ జరగనుంది. ఈ సిరీస్‌లో భారత్‌తో పాటు ఆతిథ్య శ్రీలంక 'ఏ', ఆఫ్ఘనిస్థాన్ 'ఏ' జట్లు తలపడనున్నాయి. ఈ టోర్నీలో ప్రధానంగా భారత చిచ్చరపిడుగు, 15 ఏళ్ల వైభవ్ సూర్యవంశీ ప్రధాన ఆకర్షణగా నిలవనున్నాడు. ఇటీవలే ముగిసిన ఐపీఎల్ లో వైభవ్ పరుగుల మోత మోగించిన సంగతి తెలిసిందే.

భారత జట్టు శ్రీలంక చేరుకున్న విషయాన్ని ఆ దేశ క్రికెట్ బోర్డు (ఎస్ఎల్ సీ) సోషల్ మీడియా ద్వారా ధృవీకరించింది. తిలక్ వర్మ, రుతురాజ్ గైక్వాడ్, వైభవ్ సూర్యవంశీ వంటి ఆటగాళ్లు శ్రీలంక చేరుకున్న ఫొటోలను పంచుకుంది. "భారత 'ఏ' జట్టు శ్రీలంకకు చేరుకుంది. ఉత్కంఠభరితంగా సాగే ఈ టోర్నమెంట్‌లో వారు తమ నైపుణ్యాలను ప్రదర్శించేందుకు సిద్ధంగా ఉన్నారు. ఇక ఆట మొదలవుతుంది" అని ఎస్ఎల్ సీ పేర్కొంది.

ఈ పర్యటనకు ముందు భారత జట్టులో రెండు కీలక మార్పులు జరిగాయి. తొడ కండరాల గాయంతో రియాన్ పరాగ్ సిరీస్‌కు దూరమవడంతో, అతని స్థానంలో రుతురాజ్ గైక్వాడ్‌ను వైస్ కెప్టెన్‌గా ఎంపిక చేశారు. ఐపీఎల్ 2026 చివరి దశలో రాజస్థాన్ రాయల్స్ తరఫున ఆడుతున్నప్పుడు పరాగ్ ఈ గాయానికి గురయ్యాడు. ప్రస్తుతం అతను బెంగళూరులోని బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో కోలుకోనున్నాడు. మరోవైపు, హర్ష్ దూబేకు సీనియర్ జట్టు నుంచి పిలుపు రావడంతో, అతని స్థానంలో అనుకుల్ రాయ్‌ను జట్టులోకి తీసుకున్నారు.



**భారత 'ఏ' జట్టు:**
తిలక్ వర్మ (కెప్టెన్), రుతురాజ్ గైక్వాడ్ (వైస్ కెప్టెన్), ప్రియాన్ష్ ఆర్య, వైభవ్ సూర్యవంశీ, ఆయుష్ బదోని, నిశాంత్ సింధు, సూర్యాంశ్ షెడ్గే, ప్రభ్‌సిమ్రన్ సింగ్ (వికెట్ కీపర్), కుమార్ కుశాగ్ర (వికెట్ కీపర్), విప్రాజ్ నిగమ్, యశ్ ఠాకూర్, యుధ్వీర్ సింగ్, అన్షుల్ కంబోజ్, అర్షద్ ఖాన్, అనుకుల్ రాయ్.

## ఇంగ్లండ్, కివీస్ టెస్టులో వైభవ్ సూర్యవంశీ గురించి ఆసక్తికర చర్చ.

- **ఐపీఎల్ 2026 టాప్ స్కోరర్ వైభవ్ సూర్యవంశీకి భారత జట్టు నుంచి పిలుపు**
- **ఐర్లాండ్ పర్యటనకు ఎంపిక చేసే అవకాశం ఉన్నట్లు బీసీసీఐ వర్గాల సమాచారం**
- **ఎంపికైతే, అతి పిన్న వయసులో జట్టులోకి వచ్చిన సచిన్ రికార్డు బ్రేక్**
- **లార్ట్స్ టెస్టులో వైభవ్‌పై ఇంగ్లండ్, కివీస్ మాజీ క్రికెటర్ల ప్రశంసల వర్షం**



**డిడి9 వార్త:**

ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) 2026 సీజన్‌లో పరుగుల వరద పారించి, రాజస్థాన్ రాయల్స్ జట్టును ఒంటిచేత్తో నడిపించిన 15 ఏళ్ల యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ పేరు ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా మార్మోగిపోతోంది. కేవలం దేశీయంగానే కాకుండా, అంతర్జాతీయ క్రికెట్ దిగ్గజాలు సైతం ఈ కుర్రాడి ప్రతిభకు ఫిదా అవుతున్నారు. తాజాగా, వైభవ్‌కు భారత సీనియర్ జట్టు నుంచి తొలి పిలుపు అందనుందనే వార్తలు బలంగా వినిపిస్తున్నాయి.

ఐర్లాండ్, ఇంగ్లాండ్ పర్యటనల కోసం భారత జట్టును ఎంపిక చేసేందుకు బీసీసీఐ సెలక్షన్ కమిటీ శనివారం సమావేశం కానుంది. ఈ సమావేశంలో వైభవ్ సూర్యవంశీ పేరు ప్రధానంగా చర్చకు రానున్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా ఐర్లాండ్‌తో జరిగే టీ20 సిరీస్‌కు పలువురు యువ ఆటగాళ్లను పరీక్షించాలని బీసీసీఐ భావిస్తోంది. ఈ క్రమంలో, ఐపీఎల్‌లో 776 పరుగులతో టాప్ స్కోరర్‌గా నిలిచిన వైభవ్‌కు జట్టులో చోటు కల్పించడం ఖాయంగా కనిపిస్తోంది. ఒకవేళ ఇదే జరిగితే, అతి పిన్న వయసులో భారత జట్టుకు ఎంపికైన ఆటగాడిగా క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్ పేరిట ఉన్న రికార్డు బద్దలవుతుంది. ఈ పర్యటనలో టీ20 జట్టుకు శ్రేయస్ అయ్యర్‌ను కెప్టెన్‌గా నియమించే అవకాశాలు కూడా ఉన్నాయి.

వైభవ్ ప్రతిభ కేవలం ఐపీఎల్‌కే పరిమితం కాలేదు. లార్డ్స్ వేదికగా ఇంగ్లాండ్, న్యూజిలాండ్ మధ్య జరుగుతున్న టెస్ట్ మ్యాచ్ సందర్భంగా వర్షం కారణంగా ఆటకు అంతరాయం కలగగా, కామెంటరీ బాక్స్‌లో ఇయాన్ వార్డ్, నాజర్ హుస్సేన్, సైమన్ డౌల్ వంటి మాజీ ఆటగాళ్లు వైభవ్‌పై ఆసక్తికర చర్చ జరిపారు. న్యూజిలాండ్ మాజీ బౌలర్ సైమన్ డౌల్ మాట్లాడుతూ.. "అతడు భారత జట్టుకు ఎంపికయ్యే రోజు ఎంతో దూరంలో లేదు. ఈ టోర్నమెంట్‌లో అత్యధిక పరుగులు చేయడం అద్భుతం. 15 ఏళ్ల వయసులో ఇలాంటి ప్రదర్శనను చూడటం చాలా గొప్పగా ఉంది. అతడి కోసం జట్టులో తప్పకుండా చోటు కల్పించాలి" అని ప్రశంసలు కురిపించాడు. ఈ చర్చతో వైభవ్ క్రేజ్ ఏ స్థాయికి చేరిందో అర్థమవుతోంది. ఇప్పుడు అందరి దృష్టి సెలక్షన్ కమిటీ సమావేశంపైనే ఉంది.

# పొగడ్తలను తలకెక్కించుకోను..



టాలీవుడ్ యంగ్ బ్యూటీ నిధి అగర్వాల్‌కు గత కొద్ది కాలంగా అదృష్టం అస్సలు కలిసి రావడం లేదు. ఎంత కష్టపడినప్పటికీ కష్టానికి తగ్గ ప్రతిఫలం దక్కడం లేదు. ఇటీవల చేసిన హరి హరి వీరమల్లు, ది రాజా సాబ్ రెండు భారీ అంచనాలు మధ్య విడుదలై ఆశించనంత స్థాయిలో హిట్ అందుకోలేకపోయాయి. నిధి కష్టపడినప్పటికీ శ్రమ అంతా వృధా అయిపోయింది. దీంతో గత కొద్ది కాలంగా నిధిపై విమర్శలు వస్తున్నాయి. కష్టపడినప్పటికీ ఇండస్ట్రీలో రాణించాలంటూ అదృష్టం కూడా ఉండాలని నెగెటివ్ కామెంట్లు పెడుతున్నారు. అంతేకాకుండా ఐరన్ లెగ్ అంటూ ట్రోల్ కూడా చేస్తున్నారు. తాజాగా, తనపై వస్తున్న విమర్శలపై నిధి అగర్వాల్ స్పందిస్తూ.. "నేను ఎప్పుడూ పొగడ్తలను తలకెక్కించుకోను, అలాగే విమర్శలను అస్సలు పట్టించుకోను. ఇండస్ట్రీలో ఒక సక్సెస్‌ఫుల్ నటిగా గుర్తింపు తెచ్చుకోవాలని అందరికీ ఉంటుంది, దానికి నేనేమీ మినహాయింపు కాదు. కానీ, ఇండస్ట్రీలో ఎప్పుడు ఏం జరుగుతుందో ఎవరూ ఊహించలేరు. ఒక సినిమా సక్సెస్ అనేది చాలా విషయాలపై ఆధారపడి ఉంటుంది. నేను నటించిన చిత్రాలు కొన్ని హిట్టయ్యాయి, అందుకు నేను చాలా సంతోషంగా ఉన్నాను. ఒకవేళ సినిమా ఆడకపోతే దానికి గల కారణాలను తెలుసుకుని, నన్ను నేను సరిదిద్దుకోవడానికి ప్రయత్నిస్తాను" అని చెప్పింది. తనను అదృష్టం లేని నటిగా విమర్శిస్తున్న వారికి సమాధానమిస్తూ.. తాను అదృష్టం కంటే కేవలం తన టాలెంట్‌ను మాత్రమే నమ్ముకుంటానని నిధి స్పష్టం చేసింది. సినిమా ఫలితాలతో సంబంధం లేకుండా నటిగా తన వంద శాతం శ్రమను ఎప్పుడూ పెడుతూనే ఉంటానని తెలిపింది. నిధి చేసిన ఈ కామెంట్స్ ఇండస్ట్రీలో హాట్ టాపిక్‌గా మారాయి. ఎన్ని పరాజయాలు ఎదురైనా కుంగిపోకుండా, తన టాలెంట్‌పై నమ్మకంతో ఉన్న నిధిని అభిమానులు అభినందిస్తున్నారు.

## ఆ మ్యూజిక్ డైరెక్టర్ ని చూసి ఇతర సంగీత దర్శకులు చాలా నేర్చుకోవాలి

సౌత్ ఇండియన్ సినీ ఇండస్ట్రీలో మోస్ట్ టాలెంటెడ్ అండ్ బిజీయెస్ట్ సెలబ్రిటీలలో మ్యూజిక్ డైరెక్టర్ కమ్ హీరో జీవీ ప్రకాష్ కుమార్ టాప్ ప్లేస్ లో ఉంటాడు. ప్రస్తుతం జీవి చేతిలో గంపెడు సినిమాలు ఉన్నాయి. ఒకవైపు క్రేజీ ప్రాజెక్టులకు అద్భుతమైన సంగీతాన్ని అందిస్తూ, మరోవైపు నటుడిగా వైవిధ్యమైన పాత్రలు పోషిస్తూ కోలీవుడ్, టాలీవుడ్ లలో ఫుల్ బిజీగా ఉన్నాడు జీవీ.`
జీవీ ప్రకాష్ కేవలం తమిళంలోనే కాకుండా తెలుగులోనూ టాప్ స్టార్స్ చిత్రాలకు సంగీత దర్శకుడిగా పనిచేస్తున్నాడు. వాటిలో మాస్ మహారాజా రవితేజ నటిస్తున్న ఇరుముడి ఇటీవల రిలీజ్ అయినా గ్లిమ్స్ కు మంచి బిజియమ్ ఇచ్చాడు. ఇక కోలీవుడ్ స్టార్ సూర్య, యాక్షన్ కింగ్ విశాల్ ల రాబోయే సినిమాలకు కూడా జీవీనే సంగీతం అందిస్తున్నాడు. అనిరుధ్ త్వరగా ఇవ్వడు, తమన్ తెలుగులో ఫుల్ బిజీ కావడంతో అగ్ర దర్శకులు, అగ్ర హీరోల ఫస్ట్ ఛాయిస్ గా జీవీ ప్రకాష్ దూసుకుపోతున్నారు. సంగీత దర్శకుడిగా ఇంత బిజీగా ఉంటూనే జీవీ ప్రకాష్ హీరోగా కూడా వరుస సినిమాలను లైన్ లో పెడుతున్నారు. నటుడిగా జీవీ డైరీ ప్రస్తుతం పూర్తిగా నిండిపోయింది. ఉదయం రికార్డింగ్ థియేటర్ లో కంపోజింగ్ లో ఉంటే మధ్యాహ్నం సినిమా సెట్స్ లో కెమెరా ముందుకు వచ్చి నటిస్తూ 24/7 బిజీగా గడుపుతున్నారు. సాధారణంగా ఒకే రంగంలో రాణించడం కష్టంగా భావించే ఈ రోజుల్లో సంగీతం, నటన అనే రెండు భిన్నమైన విభాగాల్లో జీవీ ప్రకాష్ చూపిస్తున్న మల్టీ టాస్కింగ్ ప్రతిభ నిజంగా అభినందనీయం. టైమ్ మేనేజ్మెంట్ లో జీవీ ప్రకాష్ రూటే వేరు. ఇంత క్రేజీ ప్రాజెక్టులను బ్యాలెన్స్ చేస్తూ ఏ ఒక్కదానికీ ఆలస్యం కాకుండా వర్క్ పూర్తి చేయడం చూస్తుంటే ఇతర మ్యూజిక్ డైరెక్టర్లు కూడా జీవీ ప్రకాష్ ని చూసి నేర్చుకోవాల్సిందే అని ఇండస్ట్రీ వర్గాల్లో చర్చ నడుస్తోంది.





## వరుస ఫ్లాపుల తర్వాత హిట్ కోసం వైష్ణవ్ తేజ్ భారీ స్కెచ్..

మెగా హీరో వైష్ణవ్ తేజ్ 'ఉప్పెన' సినిమాతో ఇండస్ట్రీకి వచ్చి బాక్సాఫీసు వద్ద తన సత్తా చాటారు. మొదటి మూవీతోనే బ్లాక్ బస్టర్ హిట్ అందుకున్నారు. ఆ తర్వాత రంగరంగ వైభవంగా, కొండ పొలం వంటి చిత్రాలు చేసినప్పటికీ వైష్ణవ్ తేజ్ హిట్ అందుకోలేకపోయారు. ఇక 2023లో చేసిన ఆదికేశవ కూడా ప్రేక్షకులను పెద్దగా మెప్పించలేకపోయింది. ఇలా వరుసగా మూడు ఫ్లాపులు రావడంతో వైష్ణవ్ తేజ్ తీవ్ర నిరాశకు గురయ్యారు. తదుపరి సినిమా విషయంలో ఎలాగైనా సరే హిట్ కొట్టాలనే పట్టుదలతో ఆయన ఇండస్ట్రీకి కాస్త గ్యాప్ ఇచ్చారు. కేవలం హిట్ కోసమే కాకుండా, తన నటనకు సరిపోయే వైవిధ్యమైన కథ కోసం వేట ప్రారంభించారు. ఈ క్రమంలో.. గత మూడేళ్లలో ఆయన ఏకంగా 100కు పైగా కథలను విన్నట్లు టాక్. ఎన్నో కథలను తిరస్కరించిన తర్వాత, ఎట్టకేలకు ఆయన తన తదుపరి ప్రాజెక్ట్‌ను ఖరారు చేసుకున్నట్లు సమాచారం. దర్శకుడు మహేష్ ఎస్ చెప్పిన ఒక అద్భుతమైన కథాంశం నచ్చడంతో వైష్ణవ్ తేజ్ ఈ సినిమాకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారట. టాలీవుడ్‌లో ప్రముఖ నిర్మాణ సంస్థ అయిన AK ఎంటర్‌టైన్‌మెంట్స్ ఈ చిత్రాన్ని భారీ బడ్జెట్‌తో నిర్మించనుంది. ఈ సినిమాకు సంబంధించిన ప్రీ-ప్రొడక్షన్ పనులు కూడా ఇప్పటికే శరవేగంగా జరుగుతున్నట్లు తెలుస్తోంది. వచ్చే నెలలో ఈ ప్రాజెక్ట్‌పై అధికారిక ప్రకటన వెలువడే అవకాశం ఉందని సమాచారం. ఆ వెంటనే సినిమా షూటింగ్‌ను కూడా ప్రారంభించడానికి చిత్ర యూనిట్ ప్లాన్ చేస్తోందట. లాంగ్ గ్యాప్ తర్వాత వైష్ణవ్ తేజ్ ఒక మంచి కథతో వస్తుండటంతో మెగా అభిమానుల్లో సరికొత్త ఆశలు చిగురించాయి. 100 కథలు విని ఓకే చేసిన ఈ సినిమాతో వైష్ణవ్ తేజ్ మళ్లీ 'ఉప్పెన' లాంటి ఘన విజయాన్ని అందుకుని, సక్సెస్ ట్రాక్‌లోకి ఎక్కుతారని అభిమానులు భావిస్తున్నారు. ప్రస్తుతం ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించిన పోస్టులు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి.

# వాళ్లను స్వయంగ కలిసి ఈ కథ రాశా..



'బిచ్చగాడు' ఫేమ్ విజయ్ ఆంటోని, దర్శకుడు శశి కలయికలో వస్తున్న మూవీ 'నూరు సామి'. తెలుగులో ఈ చిత్రం 'వంద దేవుళ్ళు' పేరుతో రిలీజ్ కాబోతున్నది. ఈ సినిమా భారీ అంచనాల మధ్య జూన్ 19న గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు రాబోతున్నది. ఈ క్రమంలోనే ప్రమోషన్స్‌లో భాగంగా సినిమాకు సంబంధించిన విశేషాలు పంచుకున్నాడు డైరెక్టర్ వశి. 'నూరుసామి కథ ఒక వాస్తవ సంఘటన ఆధారంగా రూపొందించబడింది. నేను మొదట వారిని ఒక రియాలిటీ షోలో చూశాను. ఆ షో చూస్తున్నప్పుడు నాకు ఎంతో బాధ, భావోద్వేగం కలిగాయి. ఆ తర్వాత, నేను వారిని స్వయంగా కలిసి, వారి గ్రామాన్ని సందర్శించి, అక్కడి చాలా మందిని ఇంటర్వ్యూ చేశాను. వారిని నిజ జీవితంలో కలవడం, వారి అనుభవాల గురించి తెలుసుకోవడం ఈ కథను రాయడానికి నాకు ఎంతగానో సహాయపడింది' అని తెలిపారు. కాగా.. ఈ చిత్రంలో స్వాసిక అజయ్, కావ్య, శక్తి తదితరులు ప్రధాన పాత్రల్లో నటిస్తుండగా.. రామాంజనేయులు జవ్వాని నిర్మిస్తున్నారు.

# ప్రేమ కంటే హింసాత్మకమైన యుద్ధం మరొకటి లేదు..





మూడేళ్ల గ్యాప్ తర్వాత అక్కినేని అఖిల్ మళ్లీ 'లెనిన్' సినిమాతో ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమయ్యారు. ఈ చిత్రానికి 'వినరో భాగ్యము విష్ణు కథ' ఫేమ్ మురళి కిషోర్ దర్శకత్వం వహిస్తుండగా.. అఖిల్ సరసన భాగ్యశ్రీ బోర్సే హీరోయిన్‌గా కనిపించనుంది. షూటింగ్ జరుపుకుంటున్న ఈ సినిమాను జూన్ 26న థియేటర్స్‌లోకి తీసుకురాబోతున్నారు. విడుదల తేదీ దగ్గర పడుతుండటంతో చిత్రబృందం ప్రమోషన్స్ జోరు పెంచి వరుస అప్డేట్స్ విడుదల చేస్తున్నారు. మ్యూజికల్ జర్నీ స్టార్ట్ చేసి ఇప్పటికే రెండు పాటలను విడుదల చేయగా.. ప్రేక్షకుల్లో మంచి రెస్పాన్స్‌ను రాబట్టుకున్నాయి. మ్యూజికల్ ప్రమోషన్స్‌లో భాగంగా తాజాగా ఈ సినిమా నుంచి 'సోల్ ఆఫ్ లెనిన్' పేరుతో మూడో పాటను విడుదల చేశారు. ఈ పాట ఎమోషనల్‌గా సాగుతూ ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేస్తోంది.
ముఖ్యంగా ఈ సాంగ్ విడుదల చేస్తూ చిత్రబృందం సోషల్ మీడియాలో పెట్టిన క్యాప్షన్ ఇప్పుడు అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. ''ప్రేమ కంటే హింసాత్మకమైన యుద్ధం మరొకటి లేదు'' అనే ఆసక్తికరమైన లైన్‌ను జోడించడంతో, సినిమాలో ప్రేమ ,యాక్షన్ అంశాలు ఏ స్థాయిలో ఉండబోతున్నాయో అర్థమవుతోంది. స్టార్ కంపోజర్ ఎస్.ఎస్. తమన్ ఈ చిత్రానికి అదిరిపోయే సంగీతాన్ని అందిస్తున్నారు. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, అన్నపూర్ణ స్టూడియోస్ బ్యానర్స్‌పై సూర్యదేవర నాగవంశీ, అక్కినేని నాగార్జున సంయుక్తంగా ఈ సినిమాను అత్యంత భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నారు. మూడేళ్ల నిరీక్షణ తర్వాత అఖిల్ పక్కా మాస్ అండ్ క్లాస్ సబ్జెక్ట్‌తో వస్తుండటంతో, బాక్సాఫీస్ వద్ద ఈ సినిమా బ్లాక్ బస్టర్ హిట్ అవుతుందని అభిమానులు అభిప్రాయపడుతున్నారు.

# ఒక అద్భుత లోకంలోకి అడుగుపెట్టండి.. టీజర్ అప్డేట్‌తో సినిమాపై హైప్

వైవిధ్యమైన పాత్రలు ఎంచుకుంటూ సెకండ్ ఇన్నింగ్స్‌లో కూడా దూసుకుపోతున్న అక్కినేని సుమంత్ త్వరలో ప్రతిష్ఠాత్మక చిత్రం 'మహేంద్రగిరి వారాహి' చిత్రంతో ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు సిద్ధం అవుతున్నాడు. మహేంద్రగిరిలో కొలువుదీరిన వారాహి అమ్మవారి ఆలయం, అతీంద్రియ శక్తులు, కొన్ని రహస్య మరణాల చుట్టూ ఈ సినిమా కథ తిరుగుతుందని మేకర్స్ ఇప్పటికే అనౌన్స్ చెయ్యగా సినిమాపై భారీ హైప్ క్రియేట్ అయ్యింది. అలాగే ఇటీవల ఈ సినిమా నుంచి ఫస్ట్ గ్లింప్స్ సినిమాపై ప్రేక్షకుల్లో క్యూరియాసిటీని నెలకొల్పగా.. ఇప్పుడు అదే జోష్‌తో తాజాగా టీజర్ అప్డేట్ ఇచ్చారు మేకర్స్. ఈ మేరకు ఓ పవర్ ఫుల్ పోస్టర్ రిలీజ్ చేస్తూ.. 'మహేంద్రగిరి వారాహి ద్వారాలు తెరుచుకోబోతున్నాయి. రహస్యాలు, విశ్వాసం, అంతుచిక్కని విషయాలతో కూడిన ఒక అద్భుత లోకంలోకి అడుగుపెట్టండి. జూన్ 8 న మహేంద్రగిరి వారాహి టీజర్ రాబోతున్నది సిద్ధంగా ఉండండి' అంటూ చెప్పుకొచ్చారు. కాగా.. మీనాక్షి గోస్వామి, బ్రహ్మానందం, వెన్నెల కిషోర్, రాజీవ్ కనకాల ఇందులో కీలక పాత్రలు పోషిస్తున్నారు. అనూప్ రూబెన్స్ సంగీతం అందిస్తుండగా.. రాజశ్యామల ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై మధు కాలిపు, లక్ష్మణ్ నిర్మిస్తున్నారు.





# 100 కథలు రిజెక్ట్ చేసి ఎట్టకేలకు కొత్త సినిమాను లైన్ లో పెట్టిన యంగ్ హీరో

రాకింగ్ స్టార్ యష్ నటిస్తున్న 'టాక్సిక్' కోసం అభిమానులు ఎంతగానో ఎదురుచూస్తున్న సంగతి తెలిసిందే. గీతూ మోహన్ దాస్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమాలో కియారా అద్వానీ హీరోయిన్‌గా నటిస్తుండగా.. రుక్మిని వసంత్, నయనతార, తారా సుతారియా, హుమా ఖురేషి కీలక పాత్రలో కనిపించనున్నారు. డ్రగ్స్ మాఫియా చుట్టూ తిరిగే ఈ పీరియాడిక్ యాక్షన్ డ్రామాపై ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ఇప్పటికే షూటింగ్ పూర్తి కాగా.. ఇందులోంచి వచ్చిన టీజర్ సోషల్ మీడియాలో వివాదాస్పదంగా మారిన విషయం తెలిసిందే. ఇక ముందుగా మార్చిలో విడుదల చేయాలనుకున్న మేకర్స్ పలు కారణాల వల్ల జూన్ 4న వాయిదా వేశారు. నిజానికి ఈ సినిమాను జూన్ 4న (నేడే) విడుదల చేయాలని మేకర్స్ గతంలో ప్రకటించారు. అయితే నేడు సినిమా రిలీజ్ కావాల్సి ఉన్నా, ఎలాంటి ప్రమోషన్స్ కానీ, అప్‌డేట్స్ కానీ లేకపోవడంతో సోషల్ మీడియాలో పలు రకాల పుకార్లు షికారు చేస్తున్నాయి. మూవీ షూటింగ్ పూర్తయినప్పటికీ షాకింగ్ ట్విస్ట్ వచ్చి పడింది. అయితే కొన్ని సీన్స్ విషయంలో హీరో యష్ అసంతృప్తిగా ఉన్నారని.. అందుకే ఏకంగా 100 రోజుల పాటు కొన్ని కీలక సన్నివేశాలను రీషూట్ చేయాలని నిర్ణయించుకున్నట్లు గట్టిగా టాక్ వినిపిస్తోంది. దీనికి తోడు విదేశీ పంపిణీ పరంగా కొన్ని సమస్యలు తలెత్తడం కూడా వాయిదాకు కారణమని అంటున్నారు. ఈ కారణాల వల్లే సినిమాను వచ్చే ఏడాదికి వాయిదా వేయాలని నిర్మాతలు భావిస్తున్నట్లు సమాచారం. ఈ వార్తల్లో ఎంతవరకు నిజముందో తెలియదు కానీ, నేడు థియేటర్లలో చూడాల్సిన సినిమా ఇలా వాయిదా పడటం.. రీషూట్ వార్తలు రావడం చూసి యష్ ఫ్యాన్స్ తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. నిజంగానే ఇప్పట్లో విడుదల చేయరేమో అని పలు రకాలుగా చర్చించుకుంటున్నారు.

This newspaper/periodical is published by BATHULA KUMAR RAJA from PLOT 620, ROAD NO. 34, SURVEY OF INDIA AYYAPPA SOCIETY, CHANDA NAIK NAGAR, MADHAPUR, RANGAREDDY, TELANGANA - 500081. on behalf of BATHULA KUMAR RAJA, edited by BATHULA KUMAR RAJA and printed by NAGAVARAM SREENIVAS RAO at GARUDA PRINTERS, at H.NO.2-86/1, PLOT NO 26-SP, SY NO 420, SAGAR HIGH WAY, RAGANNAGUDA VILLEGE, ABDULLAPUR MANDAL, RANGAREDDY, TELANGANA - 502510.